ప్రజాశక్తి
శుక్రవారం 25 నవంబర్ 2022 5
కర్నూలు





రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు సుధాకర్‌బాబు

మానని గాయం

- ఆధునిక యుగంలోనూ అంతులేని వివక్ష
- 10 ఉమ్మడి జిల్లాల్లోనూ వివక్ష రూపాలు
- గుడిలోకి రానివ్వరు..రచ్చకట్టపై కూర్చోనివ్వరు
- 28, 29న కెవిపిఎస్ రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మనుషులు లేకుండా కార్లు నడిచే ఈ ఆధునిక యుగంలోనూ దళితుల పట్ల కుల వివక్ష కొనసాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికీ దళితులు వివక్షకు లోనవుతున్నారు. 10 ఉమ్మడి జిల్లాల్లో వివక్ష రూపాలు ఇప్పటికీ కనిపిస్తూనే ఉన్నాయి. తరతరాల నుంచి మానని గాయంలా మనిషిని వెంటాడుతోంది. ఈ నెల 28, 29 తేదీల్లో కర్నూలులో కెవిపిఎస్ 4వ రాష్ట్ర మహాసభ జరగనున్న నేపథ్యంలో రాష్ట్రంలోని వివక్షపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం.



ఆదోని మండలం సంతేకుడ్లూరులో వివక్ష వ్యతిరేకంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న డిఎస్ఎంఎం జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి



కాలం వేగంగా పరిగెడుతోంది. ఇప్పటికే సమాజంలో చాలా మార్పు వచ్చింది. సైన్స్, సాంకేతికరంగాల్లో దేశం దూసుకుపోతోంది. అంతా కంప్యూటర్ యుగమైంది. ప్రాంతాలు, కులాలకు సంబంధం లేకుండా అంతా ఉన్నత స్థానాలను అందుకుంటున్నారు. అంతరిక్షంలోకి రాకెట్లను పంపిస్తున్నాం. ఇంకా కొన్ని చోట్ల కుల కట్టుబాటు వివక్షలు తగ్గడం లేదు. సాధారణంగా అంటరానితనం అమానుషం అంటరానితనాన్ని పాటించడం నేరం అయితే ఇవన్నీ కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం అవుతున్నాయి. రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో కుల వివక్ష తీవ్రంగా దర్శనమిస్తోంది. రాష్ట్రంలోనే కర్నూలు జిల్లాల్లో వివక్ష అత్యధికంగా కనిపిస్తోంది. రాయలసీమలోని జిల్లాల్లో 15 రకాల వివక్ష రూపాలు దర్శనమిస్తున్నాయి. వాటిలో అత్యధికంగా దళితులు దేవాలయ ప్రవేశాలు నోచుకోవడం లేదు. దళితులు రచ్చకట్టలపై కూర్చోడానికి వీల్లేదు. హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి ఇప్పటికీ కొనసాగుతోంది. అసలు హోటళ్లలోకే దళితులను రానివ్వడం లేదు. దళితుల బట్టలను రజకులు ఉతకడం లేదు. దళితులకు క్షవరం, కటింగ్ చేయడం లేదు. పీర్ల పండగ సందర్భంగా దళితులు సావుసోను(అలాయి) ఆడటానికి వీల్లేదు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రధానంగా దళితులకు అందరికీ ఇచ్చే గ్లాసుల్లో టీ ఇవ్వడం లేదు. రెండు గ్లాసుల విధానాన్ని పాటిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో దళితుల భూములకు సాగునీరు ఇవ్వడం లేదు. కర్నూలు జిల్లా మంత్రాలయంలోని రాఘవేంద్ర మఠంలో గుడిలో ఏ పనికీ దళితులను పెట్టుకోరు. చివరకు మఠంలో ఊడ్చేవాళు కూడా దళితులు కారు. పెద్దకడబూరు మండలం మేకడోణ, నెమిలేకల్, బసలదొడ్డిలో దళితులను మోటర్‌సైకిళ్లపై తిరగనివ్వరు. గోనేగండ్ల మండలం గాజులదిన్నెలో దళితుల పెళ్లి ఊరేగింపులు నిషేదం. ఆదోని మండలం అలసందగుత్తి, పత్తికొండ మండలం పందికోన, మంత్రాలయం మండలం వగరూరు, గోనేగండ్ల మండలం ఎర్రబాడు, దేవనకొండ మండలం జిల్లేడుబుడకల, కోసిగి మండలం జంపాపురంలో దళితుల పెళ్లి మెరవణి దళిత పేటలకే పరిమితం కావాలి. మంత్రాలయం మండలం వగరూరులో దళితులను ఇతరుల బావుల్లోకి దిగనివ్వరు. కర్నూలు మండలం దేవమాడలో వాల్మీకి దళితుల ఇళ్ల దగ్గరకు వెళ్లరు. వారిని తన ఇంటి వద్దకు పిలిపించుకుంటాడు. కోసిగి మండలం జంపాపురంలో ఇతరులు దళితులతో కలిసి సహపంక్తి భోజనం చేయరు.

వివక్ష రూపుమాపేందుకు చర్యలు తీసుకోవాలి



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివక్షను రూపుమాపేందుకు చర్యలు తీసుకోవాలి. వివక్షపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. అందరినీ సమానంగా చూడాలన్న భావనను తీసుకురావాలి. వివక్షను పురిగొల్పే వారిపై చర్యలు తీసుకోవాలి. కుల వివక్షపై 165 ప్రశ్నలతో త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేపట్టనున్నాం. ఆ నివేదికలను కూడా అధికారులకు సమర్పిస్తాం. కుల వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమాలు తీవ్రతరం చేస్తాం.

- ఆంధ్ర మాల్యాద్రి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.



సంతేకుడ్లూరులో దళితులకు క్షవరం చేయిస్తున్న కెవిపిఎస్ నాయకులు

తాజా వివక్ష ఘటనలు ఇలా...

- సత్యసాయి జిల్లా లేపాక్షి మండలం వంగంపల్లిలో దళితుని మృతదేహాన్ని పూడ్చకుండా అడ్డుకున్నారు.
- కర్నూలు జిల్లా ఆదోని మండలం సంతేకుడ్లూరులో" మీ దేవుడు మా వీధుల్లోకి రాకూడదని మా గ్రామ బావిలో నిమజ్జనం చేయకూడదని" హుకుం జారీ చేశారు. న్యాయం, రక్షణ కోసం భద్రత కోసం వచ్చిన పోలీసులు కూడా గ్రామ పెద్దలు చెబితేనే వెళ్లండని చెబుతూ దళితులను వెళ్ళనివ్వలేదు.
- తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం నియోజకవర్గం బ్రహ్మపురి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ కులవివక్ష విషయం కలకలం రేగింది. అగ్నికుల క్షత్రియ విద్యార్థులందరికీ ఒక పాఠశాల మిగతా విద్యార్థులందరికీ మరో పాఠశాలను మండల విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు.
- కర్నూలు జిల్లా నందవరం మండలం గురజాలలో 65 దళిత కుటుంబాలను వెలివేశారు. గ్రామంలో ఎవ్వరూ ఆ కుటుంబాలవారిని వ్యవసాయ పనుల్లోకి రానివ్వలేదు. పొరుగు గ్రామంలోనైనా పని చేసుకుందామని వెళితే, అక్కడా అడ్డుకున్నారు.

విభజన హామీల అమలుకు పోరాటం

- ప్రత్యేక హోదా సాధన సమితి రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చేదాకా విస్తృత పోరాటాలు చేస్తామని గురువారం కార్మిక కర్షక భవన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష నేతలు, ప్రజాసంఘాల నాయకులు ప్రతిన బూనారు. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ఈనెల 25న ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ చేపట్టిన ధర్నాకు మద్దతుగా గురువారం కార్మిక కర్షక భవన్‌లో ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. 25న కలెక్టరేట్ ముందు ధర్నా చేయాలని తీర్మానించారు. డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఐ నగర సమితి కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 2014 ఎన్నికల ముందు ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు హామీని నేటికీ నెరవేర్చలేదన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే పది సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలు అమలు చేస్తామని, వెనకబడిన ఉత్తరాంధ్ర రాయలసీమ ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని ఇస్తామన్నారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని, కడప స్టీల్ ప్లాంట్ నిర్మిస్తామని ఇచ్చిన వాగ్దానం తుంగలో తొక్కారని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న పార్టీలను నమ్ముకుంటే ఆంధ్ర రాష్ట్ర ప్రజలు నట్టేట మునిగిపోతారని వారి పైన ఆశలు పెట్టుకోకుండా రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం, ప్రత్యేక ప్యాకేజీ సాధన కోసం రాజకీయాలకు అతీతంగా ప్రజలు ఐక్యమై పోరాటాలు చేయడమే సరైన మార్గమన్నారు. ఆ రకంగా పోరాటాలకు నాయకత్వం వహించడానికి పోరాటాలు చేయడానికి వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు సిద్ధంగా ఉన్నాయని, ఎటువంటి త్యాగానికైనా సిద్ధపడతామని వారు ఈ సందర్భంగా తెలిపారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వెంకటేశ్వర్లు, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.నారాయణ, ఆవాజ్ నాయకులు సుభాన్, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఇ.పుల్లారెడ్డి, బీసీ సంఘం జిల్లా నాయకులు శేషఫణి, జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, రజక వృత్తిదారుల సంగం రాష్ట్ర అధ్యక్షులు గురు శేఖర్, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అలివేలు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, సిఐటియు నగర అధ్యక్షులు నరసింహులు మాట్లాడారు. ఢిల్లీలో జరిగే పోరాటానికి మద్దతుగా 25న ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేయాలని నిర్ణయించారు.

అనీమియాతో బాధపడే మహిళలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అనీమియాతో బాధపడుతున్న మహిళలపై ప్రత్యేక దృష్టి సారించేలా జిల్లా కలెక్టర్లు కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ ఆదేశించారు. గురువారం సచివాలయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ మాట్లాడుతూ అనీమియాతో బాధపడుతున్న మహిళలపై ప్రత్యేక చర్యలు తీసుకునేలా అన్ని జిల్లా వైద్య అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సూచించిన 8 సుస్థిరమైన లక్ష్యాలను నిర్దేశించిందని వాటిలో పురోగతి సాధించాలన్నారు. వాటికి సంబంధించి మహిళా పోలీసులు, సంక్షేమ సహాయకులు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లకు శిక్షణ ఇచ్చామని, వారిని వినియోగించుకోవాలని తెలిపారు. స్పందన అర్జీలను సరైన రీతిలో పరిష్కరించడమే కాక సరైన ఫోటోగ్రాఫిక్ అప్లోడ్ చేసేలా చూడాలన్నారు. జగనన్న తోడు ఫేజ్-5 లో భాగంగా ప్రతి ఒక్క గ్రామ, వార్డు, సంక్షేమ సహాయకులు నిర్దేశించిన పురోగతి సాధించాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వాలంటీర్లు టెస్టిమోనియల్స్‌కు సంబంధించి పెండింగ్ ఉన్నవి పూర్తి చేయాలన్నారు. పిఎం గ్రామీణ్‌కు సంబంధించి డిసెంబర్ 31వ తేది నాటికి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు , గ్రామ వార్డు సెక్రటరీలతో నిర్దేశించిన లక్ష్యాలను అమలు చేయాలన్నారు. ప్రతి శనివారం హౌసింగ్ రోజుగా నిర్వహించాలన్నారు. కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే విద్యుత్, నీటి సదుపాయం కల్పించాలని విద్యుత్ ఎస్ఇ ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇని ఆదేశించారు. ఇంకా మొదలు కాని ఇళ్ల నిర్మాణాలను మొదలు చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్, ఐరన్ సుక్రోజ్ సిరప్ ఇస్తున్నారా లేదా అనేది నిత్యం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ పిడిని ఆదేశించారు. వాటికి సంబంధించి జడ్‌పి సిఇఒ, డిఎంహెచ్ఒ ఐసిడిఎస్, మహిళ పోలీసులు సమన్వయంతో సమావేశాలు నిర్వహించుకొని గర్భిణీ స్త్రీలకు అందాల్సిన పోషకాలపై దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.



కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి

కుల నిర్మూలన కెవిపిఎస్ అంతిమ లక్ష్యం

- 28, 29న కెవిపిఎస్ 4వ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశించిన కుల నిర్మూలనే కెవిపిఎస్ అంతిమ లక్ష్యమని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు తెలిపారు. గురువారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి ఆండ్రా గురుస్వామి, జిల్లా కమిటీ సభ్యులు చిన్న రోశన్న విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కెవిపిఎస్ ఆవిర్భవించిన 24 సంవత్సరాల తర్వాత ఆంధ్ర రాష్ట్ర తొలి రాజధాని నగరంగా ఉన్న, పోరాటాల పురిటిగడ్డ కర్నూలు నగరం కేంద్రంగా కెవిపిఎస్ 4వ రాష్ట్ర మహాసభలను నవంబర్ 28 ,29 తేదీలలో నిర్వహిస్తున్నామన్నారు. మహాసభలలో భాగంగా మొదటి రోజు ధర్నా చౌక్ వెనక ఉన్న కిసాన్ ఘాట్ నుండి వేలాది మందితో ప్రదర్శన నిర్వహించి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం ముందు భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. బహిరంగ సభకు దళిత్ సోషన్ ముక్తి మంచ్ డిఎస్ఎంఎం జాతీయ అధ్యక్షులు, కేరళ ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ శాఖ మాత్యులు కె. రాధాకృష్ణన్, డిఎస్ఎంఎం.జాతీయ కార్యదర్శి వి. శ్రీనివాసరావు, డిఎస్ఎంఎం జాతీయ నాయకులు జాన్‌వెస్లీ, కెవిపిఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఒ. నల్లప్ప, ఆండ్రా మాల్యాద్రి వక్తలుగా సభకు హాజరవుతున్నారన్నారు. జిల్లా నలుమూలల నుండి ప్రదర్శన బహిరంగ సభలకు వేలాదిగా తరలిరావాలన్నారు. జిల్లాలో అంటరానితనం ప్రధాన సమస్యగా ఉండడంతో పాటు దాడులకు తోడు వెలివేతలు కూడా జరుగుతున్నాయన్నారు. దళిత వృత్తిదారులు సమాజ అవసరాలకు ఉపయోగపడుతూనే ఎలాంటి హక్కులు లేక ఆకలి బాధలు అనుభవిస్తున్నారన్నారు. కాటికాపరి వృత్తిదారులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. డప్పు చర్మకారుల పెన్షన్‌ను పెంచాలని, దళితులు ఆత్మగౌరవంగా బతికేందుకు రెండు ఎకరాల సాగు భూమి, మూడు సెంట్ల స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలనే అంశాలపై ప్రధాన చర్చ జరిపి భవిష్యత్తు ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. మహాసభల జయప్రదం కోసం అన్ని వర్గాల ప్రజానీకం సహకరించాలని వారు కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు



గడపగడపకు మనప్రభుత్వ కార్యక్రమంలో ఎంఏ.హఫీజ్‌ఖాన్

వైసిపి తోనే సంక్షేమం సాధ్యం : హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వైసిపి తోనే ప్రజాసంక్షేమం సాధ్యమవుతుందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ.హఫీస్ ఖాన్ అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని స్థానిక 9వ వార్డు 22వ సచివాలయం పరిధిలో గురువారం కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు స్థానిక ప్రజలు పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. గడప గడప కార్యక్రమంకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. వీధుల్లో ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలు కూడ తెలుసుకొని పరిష్కరిస్తాము తెలిపారు. విధుల్లో అక్కడక్కడా బోర్లు మరమ్మతులు వెంటనే పరిష్కరించారు. డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్తు సమస్యలు ఆయన దష్టికి తీసుకువచ్చారు. ఈ పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక 9వ వార్డ్ కార్పొరేటర్ టి. పుల్లమ్మ, నాయకులు ఘన స్వాగతం పలికారు. స్థానిక వార్డు నాయకులు నవీన్ కుమార్, కార్పొరేటర్ యూనుస్, తబ్రేజ్, నజీర్ భాయ్,రశేఖర్, విజయ్, సలాం భాయ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పాణ్యం నియోజకవర్గ పరిధి కల్లూరు అర్బన్ 29 వ వార్డ్ అరుణ నగర్, సప్తగిరినగర్‌లలో రూ.50 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి, సొసైటీ కాలనీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు ఫేస్-2 కింద రూ.కోటి ఇరవై లక్షలతో 10 అదనపు తరగతి గదుల నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర మేయర్ బివై.రామయ్య భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, స్థానిక వార్డ్ కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి, స్టాండింగ్ కమిటీ మెంబర్ సానశ్రీనివాసులు, కార్పొరేటర్లు మైతాపు నరసింహులు, కాశపోగు జయరాముడు, మిద్దె చిట్టెమ్మ, నాగ లక్ష్మిరెడ్డి, డిఇ.గోపాలకృష్ణ, ఎఇ,కృష్ణలత, ఎంఇఒ శ్రీనివాసులు, నాయకులు తిరుమలేష్ గౌడ్, పెద్దన్న, నాగమద్దిలేటి, హుస్సేనీఆలం, భూపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మీపురం రాజు, టీచర్ రత్నం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బివై.రామయ్య



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

రు.1.98 కోట్ల తో రోడ్డుకు భూమి పూజ

ప్రజాశక్తి-తుగ్గలి:

మండలం పరిధిలోని జొన్నగిరి నుండి పగిడి రాయికి రూ 1.98 కోట్లతో మంజూరైన పనులకు పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి గురువారం భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ తుగ్గలి మండలం పరిధిలోని వివిధ గ్రామాలలో చేపట్టే పనులకు దాదాపు రూ.17 కోట్ల మేర నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే ఆ పనులకు భూమి పూజ చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను పూర్తిగా అభివృద్ధి చేయడానికి నిధులను కేటాయించిందన్నారు. గడపగడపకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రికే జగన్‌కే దక్కిందన్నారు. జగన్నాథ్ రెడ్డి, తుగ్గలి మోహన్ రెడ్డి, జిట్టా నగేష్ యాదవ్, తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి, నాగభూషణం రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి,ఎంపిపి భర్త రంగన్న, జడ్పిటిసి పులికొండ నాయక్, వైస్ ఎంపిపి మల్లికార్జున, వాల్మీకి డైరెక్టర్ గుంతాదేవి, విద్యా కమిటీ చైర్మన్ గుంత రాఘవేంద్ర, అధికారులు పాల్గొన్నారు.



పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయం ముందు రైతుల ఆందోళన

మార్చి వరకు హంద్రీనీవా నీరివ్వాలి

ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-పత్తికొండ: హంద్రీనీవా నీటిని మార్చి చివరి వరకు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి రంగారెడ్డి కోరారు. గురువారం పత్తికొండ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో తుగ్గలి, దేవనకొండ, మద్దికెర, పత్తికొండ రైతుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్దపెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌డిఒకు అందజేశారు. రైతు సంఘం నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హంద్రీనీవాను నీటిని డిసెంబర్ నెల వరకు విడుదల చేస్తామని, జిఒ విడుదల చేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. హంద్రీనీవా కాలువ కింద రబీ సీజన్‌లో వేల ఎకరాలలో రైతులు పంట సాగు చేశారని తెలిపారు. నీటిని నిలిపివేస్తామని చెప్పడంతో రైతుల ఆందోళన చెందుతున్నారన్నారు. మార్చి వరకు నీటిని విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు సంఘం ఉపాధ్యక్షులు రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వీరశేఖర్, రైతు సంఘం పత్తికొండ మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్, పత్తికొండ మండల ఆవాజ్ కమిటీ కార్యదర్శి తాజ్ మహమ్మద్, నాయకులు గోపాల్, ప్రభాకర్ రెడ్డి, కొండారెడ్డి, శ్రీరాములు, శ్రీనివాసులు, రాముడు, సూరి ,రైతులు రాంపురం వెంకటేశులు, జొన్నగిరి హనుమన్న, రాంపురం మల్లయ్య, నారాయణస్వామీ, ప్రతాప్, గిరిగెట్ల గంగాధర్, దిలీప్ పాల్గొన్నారు.



అడిషనల్ ఎస్‌పిని అభినందిస్తున్న మైపర్ డైరెక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపల్ సురేష్

మైపర్‌లో ఫార్మసీ జాతీయ వారోత్సవాలు

కర్నూలు క్రైమ్: కర్నూలు నగరం లోని మదర్ థెరిస్సా ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా కళాశాలలో క్రికెట్ , కబడ్డి పోటీలను నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ముఖ్యఅతిథిగా అడిషనల్ ఎస్‌పి కృష్ణకాంత్ పటేల్ పాల్గొన్నారు. ఫార్మసీ రంగాన్ని ఎంచుకున్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అడిషనల్ ఎస్‌పి అన్నారు. ప్రస్తుతం మంచి ఉద్యోగావకాశాలున్నాయని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, అకాడమిక్ డైరెక్టర్ స్టెల్లా సతీష్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. సురేష్ అకాడమిక్ డీన్ ఎం. రాజ్ కుమార్ , అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్న వ్యాపారులను బతకనీయరా?

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న చిన్నవ్యాపారుల సంఘం అధ్యక్షులు షరీఫ్

స్మార్ట్ సిటీలో ఫుట్‌పాత్ లపై చిన్న వ్యాపారస్తులు బతకడం నేరమా అని రోడ్డు సైడ్ చిన్న వ్యాపారస్తుల సంఘం సిఐటియు నగర అధ్యక్షులు, ఎస్ఎండి.షరీఫ్ వైసిపి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కర్నూలు నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ ముందు రోడ్డు సైడ్ చిన్న వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో నూర్ అహ్మద్ అధ్యక్షతన గురువారం ధర్నా చేశారు. షరీఫ్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీలో ఫుట్పాత్ లపై చిన్న వ్యాపారస్తులు ఎవరు కూడా ఉండకుండా, చిన్నచిన్న షెడ్డులను, తోపుడుబండ్లను, బంకులను తొలగించాలని ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్లుందన్నారు. నగర కమిషనర్ అత్యుత్సాహం చూపించి అవార్డు లు పొందడానికి, నగరాన్ని రెడ్‌జోన్, ఆరెంజ్ జోన్, గ్రీన్ జోన్ అని విభజించి, నగరానికి దాదాపు 20 కిలోమీటర్ల దూరం వరకు చిన్న వ్యాపారస్తులు ఉండకుండా చేయాలని చూస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం నగర కమిషనర్‌తో కలిసి కుట్రలు చేస్తుందన్నారు. చిన్న వ్యాపారస్తుల పొట్ట కొట్టడం సరైంది కాద న్నారు. జిల్లాలో ఉపాధి లేక రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్‌కు ఇబ్బంది కాకుండా ఒకరికి మరొకరు తోడుగా ఉంటూ, ప్రత్యక్షంగా పరోక్షంగా దాదాపు 5,000 మంది చిన్న వ్యాపారాలు చేసుకొని జీవిస్తున్నారని అన్నారు. పోలీసుల ద్వారా దౌర్జన్యాలు చేయిం చడం, ట్రాఫిక్ పోలీసులతో కేసులు పెట్టించడం, ఈ రకంగా టార్చర్ చేయ డాన్ని రోడ్డు సైడ్ చిన్న వ్యాపారస్తుల సంఘం సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. చిన్న వ్యాపారస్తులందరికీ ప్రభుత్వం భద్రత భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యేలను, కమిషనర్‌ను డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే రోడ్డు సైడ్ చిన్న వ్యాపారస్తులను సమీకరించి ఆందోళన చేస్తామన్నారు. రోడ్డు సైడ్ చిన్న వ్యాపా రస్తుల సంఘం నగర నాయకులు ఇంతియాజ్ ప్రసంగించారు. మహబూబ్‌బాషా, అబ్దుల్ రహీమాన్, ఎం.రాజు, జమలయ్య, జావీద్, అబ్దుల్లా, గౌస్, షబ్బీర్, లక్ష్మిదేవి, మహేశ్వరమ్మ, ఖాదర్, సయ్యద్, జయరాం, ఎల్లప్ప, ఆరిఫ్, రోడ్డు సైడ్ చిన్న వ్యాపారస్తులు పాల్గొన్నారు.

హరికృష్ణనగర్‌లో కబ్జాకోరుల ఆగడాలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

పెద్దపాడు రోడ్డులోని హరికృష్ణనగర్‌లో కబ్జాదారుల ఆగడాలకు అంతే లేకుండా పోతుంది. ప్రజలు పైసా పైసా కూడా పెట్టి స్థలాలు కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకొని ఆ స్థలంలో నివాస ప్రాంతాలను ఏర్పాటు చేసుకుంటే.. కొంతమంది అక్రమార్కులు తమ అనుచరులతో ఆ ఇళ్లను ధ్వంసం చేసి బీభత్సం సృష్టిస్తున్నారు. హరికృష్ణనగర్ సర్వేనెంబర్ 76/4 స్థలంలో 15 సెంట్లు స్థలాన్ని ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న కోటి మహేశ్వర్, సాఫ్టువేర్ ఉద్యోగి వడ్డే రాము 2020లో కొనుగోలు చేశారు. ఆ స్థలం చుట్టూ స్తంభాలు పాతి బండలు వేసి ఓ ఇంటిని నిర్మించుకొని ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ ప్రాంతంలో ఓ ముఠాలను ఎన్నో ఏళ్లుగా తప్పుడు డాక్యుమెంటు పత్రాలను చూపిస్తూ కబ్జాలకు పాల్పడుతూ ప్రజలను బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. కోటి మహేశ్వర్, వడ్డేరాము వేసుకున్న ఇంటిని చరణ్‌రెడ్డి, తిరుపాలరెడ్డి తమ అనుచరులతో ఇంటిని ధ్వంసం చేసి చుట్టుపాతిన స్తంభాలను పీకి బండలను మొక్కలను పీకి వేసి బీభత్సం సృష్టించారు. బాధితులు కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



మహాసభలో మాట్లాడుతున్న నాయకులు

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా

ప్రజాశక్తి-ఆలూరు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా తెలిపారు. గురువారం ఆలూరు జూనియర్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఎస్ఎఫ్ఐ మండల 7వ మహాసభలో రెండోరోజు 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా లక్ష్మీనారాయణ, పోతురాజు, మండల సహాయ కార్యదర్శులుగా నీలకంఠ నాయక్, రవి, మహాలక్ష్మి, మండల ఉపాధ్యక్షులుగా గిరిమూర్తి, వీరస్వామి, సుమలత, కమిటీ సభ్యులుగా నరసింహ, హరికృష్ణ, బీరప్ప, శ్రీరాములు, పరమేష్, ఉమా మహేశ్వరి, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ మండల కో కన్వీనర్‌గా ఇందుశ్రీని ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, పోతురాజు మాట్లాడుతూ... మండలంలో విద్యార్థుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆలూరు విద్యాభివృద్ధికి ప్రభుత్వంపై, ప్రజాప్రతినిధులపై, అధికారులపై ఉద్యమాలు చేసి ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా పాల్గొన్నారు.

పార్కు ప్రహరీకి భూమి పూజ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు : పట్టణంలో 8వ వార్డు హుస్సేనప్ప కొట్టాలలో మున్సిపల్ పార్క్ ప్రహరీ నిర్మాణానికి రూ.27 లక్షలతో వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ కెఎస్.రఘు, వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డిఇఇ మనోహర్ రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్ అహ్మద్, పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, ప్రధాన కార్యదర్శి యుకె.వీరేంద్ర, పట్టణ అధికార ప్రతినిధి కె.సునీల్ కుమార్, టౌన్ బ్యాంకు ఛైర్మన్ యుకె.రాజశేఖర్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

ప్రభుత్వ విద్యకు పెద్దపీట : ఎంపిడిఒ

హోళగుంద : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసినట్లు ఎంపిడిఒ దాసు నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని ఎల్లార్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 9 అదనపు గదులు మంజూరు కావడంతో ఎంపిడిఒ దాస్ నాయక్, ఎంఇఒ ఈరన్న, సర్పంచి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ దాసు నాయక్, యువ నేతలు దర్గప్ప, ఎస్‌కె.గిరి మాట్లాడారు. అదనపు గదుల నిర్మాణానికి రూ.1.06 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కబీర్, ఛైర్మన్ రంగస్వామి, రామన్న గౌడ్, రాఘవేంద్ర స్వామి, లక్ష్మణ్, రాము, మల్లి, రాజా, జెసిబి మంజు, శంక్రి నిజం, నూరి ఈరన్న, మలింగ ఈరన్న పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి - నందవరం

కబడ్డీ పోటీల్లో విజేతల కు గురువారం బహుమతులు అందజేశారు. నందవరంలో శ్రీబీరలింగేశ్వర స్వామి దేవర సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను సర్వ రక్షక సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌కు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్ రూ.30 వేలను నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీరప్ప దేవర సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఏర్పాటు శుభ పరిమాణమమని తెలిపారు. గ్రామంలో ఎలాంటి ఆటల పోటీలు నిర్వహించినా తన వంతు సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. మొదటి బహుమతి నందవరం జూనియర్ టీంకు రూ.15 వేలు, రెండో బహుమతి నందవరం దుర్గా టీం రూ.10 వేలు, మూడో బహుమతి గోనెగండ్ల టీంకు రూ.5 వేల చొప్పున అందజేశారు. దుర్గ యూత్‌కు జెర్సీలను అందజేశారు.



బహుమతులను అందజేస్తున్న మాధవరావు దేశాయ్

పూర్తికాని బ్రిడ్జి నిర్మాణం

- ఇబ్బందుల్లో వాహనదారులు

ప్రజాశక్తి - ఆదోని

అసంపూర్ణంగా చేపట్టిన రోడ్డు మరమ్మతులతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి వాహనదారులు రోజూ ఇబ్బందులకు గురవుతున్నారు. హైవే రోడ్డు పనుల్లో భాగంగా ఆదోని పట్టణంలోని పంజరపోలు వద్ద కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. పనులు నత్తనడకన సాగుతుండడం వల్ల ఆ ప్రదేశంలో రోడ్డు ఇరుకుగా ఏర్పడింది. నిత్యం వాహనాల రద్దీతో రాకపోకలతో ఆ ప్రాంతమంతా ట్రాఫిక్ స్తంభించి అటువైపు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఆదోని నుంచి ఆలూరు, బళ్లారి, హోస్పేట్, ఇతర కర్ణాటక దూర ప్రాంతాలకు వాహనాలు వెళ్తుంటాయి. ఎదురుగా వాహనాలు వచ్చేటప్పుడు క్లియర్ అయ్యేందుకు సమయం పడుతోందని ప్రయాణికులు, వాహనదారులు పేర్కొంటున్నారు. పట్టణంలోని శంకర్ నగర్, లేబర్ కాలనీ వద్ద అసంపూర్ణంగా వదిలేసిన మెయిన్ రోడ్డు నిర్మాణ పనుల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు కూడా పూర్తిగా వేయకపోవడంతో కంకర తేలి దుమ్ము, ధూళితో అనారోగ్యం పాలవుతున్నామని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. రోడ్డు సగ భాగం మొక్కుబడిగా పనులు చేసి మిగిలిన సగం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఎదురుగా మరో వాహనం వస్తే తప్పించే ప్రయత్నంలో తవ్విన లోయలో అదుపు తప్పి ప్రమాదం జరిగిన సంఘటనలూ ఉన్నాయి. నిరంతరం రద్దీగా వాహనాలు ప్రయాణించే చోట ఇలా పనులు మధ్యలో వదిలేయకుండా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పనులు పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పంజరపోలు వద్ద బారులు తీరిన వాహనాలు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహశీల్దార్ లక్ష్మీనారాయణ

వంట మెచ్చుకునేలా ఉండాలి

- తహశీల్దార్ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ మెచ్చుకునేలా వంట చేయాలని తహశీల్దార్ లక్ష్మీనారాయణ మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సూచించారు. గురువారం చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో పాటు భోజనం చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గోరుముద్ద పథకంలో మెనూ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంట్లో ఎలాగైతే చేసుకుంటామో అలాగే ఉండాలన్నారు. ఆర్ఐ గుండాల నాయక్, ఎపిఎం నాగార్జున, ప్రధానోపాధ్యాయులు రఘునాథ్ పాల్గొన్నారు.

తుంగ తీరంలో కార్తీక దీపోత్సవం



దీపాలను వెలిగిస్తున్న మహిళలు

కౌతాళం : కార్తీక మాసం చివరి రోజు తుంగభద్ర నది తీరంలో కార్తీకమాస దీపోత్సవం నిర్వహించారు. గురువారం మండలంలోని మేలిగనూర్ వద్ద వెలిసిన శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం తుంగభద్ర నది ఒడ్డున దీపాలను వెలిగించారు. నదీచాగి, కుంబాలనూర్ క్యాంపు, ఆయా గ్రామాల్లోని మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తుంగభద్ర నదీమ తల్లికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. తుంగభద్ర నది ప్రాంతమంతా పండగ వాతావరణం నెలకొంది.

'పోలీసులపై చర్యలు తీసుకోవాలి'

ఆలూరు : న్యాయవాదులను కించపరిచే విధంగా దుర్భాషలాడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్షావలీ, వాయుజీవోత్తమరావు కోరారు. గురువారం న్యాయవాదులు విధులను బహిష్కరించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సర్కిల్‌లో మౌనప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మధ్యాహ్నం సమస్య తీవ్రం కాకుండా పోలీసు అధికారులు, న్యాయవాదులతో చర్చలు జరపడంతో సమస్య సద్దుమణిగిందని చెప్పారు. న్యాయవాదులు సిద్ధప్ప, విజయరాజు, రవి, మాధవ కృష్ణ, శివకుమార్, తిమ్మయ్య, కృష్ణ కుమార్, రాజగోపాల్ నాయుడు, ఈరన్న రావు, విజయభాస్కర్, చాంద్, ప్రసాద్, షాకీర్, రాజేష్, నబీ పాల్గొన్నారు.

సీజనల్ హాస్టల్ ప్రారంభం

హోళగుంద : హోళగుంద పాత కడ్లేమాగి పాఠశాల భవనంలో కాలనుగుణ వసతి గృహాన్ని (సీజనల్ హాస్టల్) ఎంపిడిఒ దాసు నాయక్, ఎంఇఒ ఈరన్నలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వ శిక్ష అభియాన్ వారి సౌజన్యంతో అంబేద్కర్, ఎస్‌హెచ్‌జి వారికి నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పినట్లు తెలిపారు. తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు వలస వెళ్లకుండా ఇక్కడే వసతి గృహంలో ఉండి విద్యనభ్యసించేందుకు సీజనల్ హాస్టల్ దోహదపడుతుందని చెప్పారు. హోళగుందతో పాటు మండలంలోని హెబ్బటం, వందవాగాలి గ్రామాల్లో ఎన్ఆర్ఎస్‌టిసి కేంద్రాలను ప్రారంభించినట్లు చెప్పారు. ఉషోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ చిన్నహ్యాట నాగరాజు, వెలుగు ఎపిఎం హనుమంతు, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, ఉప సర్పంచి భర్త దొడ్డ బసప్ప, రిలయన్స్ ఫౌండేషన్ సమన్వయకర్త నాగరాజు, సిఆర్‌పిలు లక్ష్మప్ప, రేణుక, తుకారం, కంప్యూటర్ ఆపరేటర్లు పంపాపతి, సాయి బేస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో...

వలస కూలీ మృతి

- చొక్కనహళ్లిలో విషాదఛాయలు

ప్రజాశక్తి - ఆస్పరి



బతుకుదెరువు కోసం కుటుంబంతో కలిసి వలస వెళ్లిన కూలీ బోయ రాజు (32) మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మండలంలోని చొక్కనహళ్లి గ్రామానికి చెందిన బోయ రాజు కుటుంబంతో పాటు 50 కుటుంబాలు తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండలం రాయికూర్ గ్రామానికి 15 రోజుల క్రితం పత్తి కోత కోసం వలస వెళ్లారు. రోజువారీలాగే బుధవారం ఉదయం కుటుంబంతో కలిసి పత్తి కోతకు వెళ్లారు. రాత్రి పత్తి బస్తాలను యజమాని ఇంటికి ట్రాక్టర్‌లో తీసుకెళ్లి దింపి తిరిగి వస్తుండగా వెనుక వైపు వస్తున్న చెరుకు లారీ ఢీకొట్టింది. ట్రాక్టర్ లాక్ రాజు పొట్టలోకి దిగడంతో దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని స్వగ్రామమైన ఆస్పరి మండలం చొక్కన హళ్లికి గురువారం అంబులెన్స్‌లో తరలించారు. మృతునికి భార్య మహాలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కు మృతి చెందడంతో భార్య, పిల్లలు అనాథలు అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అజ్మతుల్లా మృతి టిడిపికి తీరని లోటు

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



పట్టణ సీనియర్ నాయకులు, టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు అజ్మతుల్లా మృతి టిడిపికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. అజ్మతుల్లా గురువారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆయన మతికి డాక్టర్ బీవీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అజ్మతుల్లా 1982 నుంచి తన తండ్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డితో పాటు టిడిపికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. అజ్మతుల్లా మరణవార్త విన్న వెంటనే వారి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

బెల్డోనలో గ్రామ సభ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని బెల్డోన గ్రామంలో సర్పంచి కరివేముల సావిత్రి ఆధ్వర్యంలో సమగ్ర హౌసింగ్ సర్వేపై పంచాయతీ కార్యదర్శులు నరేంద్ర, రామాంజనేయులు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం సమగ్ర హౌసింగ్ సర్వే చేపడుతోందని, ప్రజలంతా సహకరించాలని కోరారు. గ్రామ సమస్యలపై చర్చించారు. టిడిపి నాయకులు గోవిందు పాల్గొన్నారు.

పేదల పట్టాలను రద్దు చేయించిన

టిడిపి నాయకులకు బుద్ధిచెప్పాలి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదలకు మంజూరు చేసిన ఇంటి పట్టాలను రద్దు చేసిన టిడిపి నాయకులకు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం ఆదోని పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో 13వ వార్డుకు చెందిన మహిళలకు ఇంటి స్థలాలకు కౌన్సిలర్ వైపి.పద్మావతి అధ్యక్షతన పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేదలకు సొంతింటి కల సాకారం చేసే దిశగా జగనన్న కాలనీ కోసం 100 ఎకరాల భూమి కొనుగోలు చేసి 10 వేల గృహాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదల సొంతింటి కోసం స్థలం కొనుగోలు చేసి, రూ.2100 చెల్లించిన వారందరికీ స్థలాలు, గృహాలు మంజూరయ్యాయని చెప్పారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి నాయకులు పేదలకు పంపిణీ చేసిన ఇంటి పట్టాలను రద్దు చేసి స్థలాన్ని ఆటోనగర్ కోసం కేటాయించారని తెలిపారు. తాను ప్రతిపక్ష పార్టీలో ఎమ్మెల్యేగా ఉండి పట్టాల రద్దును అడ్డుకున్నామన్నారు. 2019 ఎన్నికల సందర్భంగా ఇంటి పట్టాల కోసం రూ.2100 చెల్లించిన వారందరికీ పట్టా ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు పంపిణీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. స్థలాల్లో ప్రభుత్వమే ఇంటి నిర్మాణం చేపట్టే దిశగా కృషి చేస్తానని వివరించారు. మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను విక్రయించరాదని, మంచి వ్యాల్యూ అవుతుందని, దగ్గరలోనే బైపాస్ రోడ్డు ఏర్పాటు జరుగుతోందని చెప్పారు. కాలనీలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని, ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకొని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కోరారు. తహశీల్దార్ వెంకటలక్ష్మి, ఆర్ఐ జయరాం రెడ్డి, విఆర్ఒ హనుమంతరావు, నాయకులు కృష్ణమోహన్, కుంకనూరు వీరేష్, చిన్న ఈరన్న, గోవర్ధన్ రెడ్డి, గురునాథ్ రెడ్డి, నారాయణ వాల్మీకి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

యువకునిపై కత్తులతో దాడి

-పరిస్థితి విషమం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని హెచ్.మురవని గ్రామానికి చెందిన మాల వీరేష్‌పై గురువారం గుర్తు తెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. మురవని గ్రామానికి చెందిన మాల మాల వీరేష్, సుకన్యలు 9 నెలల క్రితం ప్రేమించుకొని వివాహం చేసుకున్నారు. వీరు ఎమ్మిగనూరు పట్టణంలో నివాసం ఉంటున్నారు. సుకన్య మురవని పిహెచ్‌సిలో విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగరీత్యా ఇద్దరూ ఎమ్మిగనూరు నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. మార్గమధ్యంలో గుర్తు తెలియని దుండగులు ఆటోతో ఢీకొట్టి, కింద పడిన వీరేష్‌పై రాడ్డుతో, వేటకొడవళ్లతో దాడి చేశారు. గాయపడిన అతన్ని ముళ్ల పొదలో పడేసి అక్కడి నుంచి పారిపోయారు. గమనించిన స్థానికులు హుటాహుటిన అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుని భార్య సుకన్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బాధితులకు అండగా ఉంటాం

ఎమ్మిగనూరు : మాల వీరేష్‌పై కత్తులతో దాడి చేయడం దుర్మార్గమని, కేసును నిష్పక్షపాతంగా విచారణ చేయాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని మాల మహానాడు రాయలసీమ జిల్లాల అధ్యక్షులు సి.రంగయ్య తెలిపారు. గురువారం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వీరేష్‌పై దాడి చేసిన దుండగులపై రౌడీ షీట్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. మాల వీరేష్ భార్య సుకన్యకు ప్రాణ హాని ఉందని పోలీసులకు అర్జీ పెట్టుకున్నా కేవలం కౌన్సెలింగ్ పేరుతో చేతులు దులుపుకోకుండా వారికి రక్షణ కల్పించాలని కోరారు.

అరవింద్ శెట్టికి వైసిపి పరామర్శ

మంత్రాలయం : మంత్రాలయంలోని జిపిఎస్ లాడ్జి యజమాని అరవింద్ శెట్టిని వైసిపి రాష్ట్ర నాయకులు, ఎమ్మిగనూరు ఆర్‌టిసి డిపో ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వై.సీతారామిరెడ్డి గురువారం పరామర్శించారు. మంత్రాలయం గ్రామానికి చెందిన జిపిఎస్ లాడ్జి యాజమాని అరవింద్ శెట్టి కొన్ని రోజుల క్రితం చిలకలడోణ గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడడంతో కాలు విరిగింది. కర్నూలులో ఆపరేషన్ చేయించుకుని మంత్రాలయం చేరుకున్న ఆయనను సీతారామిరెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, నాయకులు జనార్ధన్ రెడ్డి ఉన్నారు.



అరవింద్ శెట్టిని పరామర్శిస్తున్న సీతారామిరెడ్డి

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి
- ట్యాంకుకు భూమిపూజ

ప్రజాశక్తి - మంత్రాలయం

గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కాచాపురం గ్రామంలో జల జీవన్ మిషన్ పథకం కింద రూ.20 లక్షలతో తాగునీటి ఒహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమమే ముఖ్యంగా పరిపాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా మరో రూ.70 లక్షలతో పరమాన్ దొడ్డి తండా, మాధవరం జగనన్న (మంత్రాలయం రోడ్డు, చర్చి వెనుక భాగంలో ఉన్న) కాలనీలో కూడా త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని అధికారులు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. సిఐ భాస్కర్, ఎస్ఐ వేణు గోపాల్ రాజ్, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, మండల ఇన్‌ఛార్జీ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాస్ రెడ్డి, ఎఇ వేద స్వరూప, అసిస్టెంట్ ఇంజినీరింగ్ పద్మ, కాంట్రాక్టర్ రామరాజు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

అమీలియో వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కాచాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కర్నూలుకు చెందిన అమీలియో హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం ముఖ్యమని తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో దాదాపు 270 మంది పరీక్షలు చేయించుకున్నారని, వీరిలో 36 మందికి డిసెంబర్ 3న ఆపరేషన్ చేస్తామని వైద్యులు చెప్పారు. డాక్టర్లు యశోద, గోవర్ధన్, లక్ష్మణ్, సిఐ భాస్కర్, ఎస్ఐ వేణు గోపాల్ రాజ్, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, మండల ఇన్‌ఛార్జీ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి, రాయలసీమ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు ఎంజి.సింహ, వీరన్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'నేషనల్' విద్యార్థులు

ప్రజాశక్తి - ఆదోని

ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ జి.గోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కబడ్డీ, షాట్‌పుట్, లాంగ్ జంప్, క్రికెట్ అండర్-14, 17 విభాగాల్లో నూర్ బాష, శ్రావణి, అనుశ్రీ, ప్రమోద్, వై.సుష్మా ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు సత్యశ్రీ, డైరెక్టర్ ఎస్.విజయ్ కుమార్ పాల్గొన్నారు. **దేవనకొండ :** ఈనెల 22, 23న జిల్లా అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్ కబడ్డీ పోటీల్లో మండలంలోని తెర్నేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ప్రశాంతి, వ్యాయామ ఉపాధ్యాయులు భాను తెలిపారు. వారు మాట్లాడుతూ... అండర్-17 విభాగం షార్ట్‌పుట్‌లో పాఠశాలకు చెందిన కార్తీక్, 3 కిలోమీటర్లు, 1500 మీటర్ల పరుగు పందెంలో మస్తాన్ వలీ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. అండర్-14 విభాగంలో రాజ్ కుమార్ కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను ఎంపిపి లక్ష్మీదేవి, సర్పంచి అరుణ్ కుమార్, ఎస్ఎంసి ఛైర్మన్ చిన్న వెంకప్ప, ఉపాధ్యాయులు హిమకుమార్, వరప్రసాద్ రెడ్డి, కృష్ణమూర్తి, మహబూబ్ బాషా, శివప్రసాద్ అభినందించారు. **కోసిగి రూరల్ :** జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో మండలంలోని పల్లెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరించారు. అండర్-14 విభాగంలో బెళగల్ రాజేశ్వరి, అండర్-17 విభాగంలో పైయింటి గంగోత్రి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయులు యుపి సుధాకర్ బాబు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు గంగాధర్‌ను, విద్యార్థినులను ఉపాధ్యాయులు ఈరన్న, శిరోమణి, విజయ్ కుమార్, యశోద, సురేంద్ర అభినందించారు.

చదువుతోపాటు సృజనాత్మకత పెంపొందించుకోవాలి : జడ్‌పిటిసి

దేవనకొండ : విద్యార్థులు చదువుతోపాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని జడ్‌పిటిసి కిట్టు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాషిని సూచించారు. గురువారం పాఠశాలలో అటల్ టక్రిన్ ల్యాబ్స్ ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన విద్యార్థులు వివిధ సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించి వివరించారు.



ప్రయోగాలను పరిశీలిస్తున్న జడ్‌పిటిసి కిట్టు

విద్యాదానం గొప్పది

- ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి
- 32 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపిక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

అన్ని దానాల్లోకెల్లా విద్యాదానం గొప్పదని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. గురువారం ఆయన బనవాసిలోని గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాల నుంచి అత్యధిక సంఖ్యలో విద్యార్థులకు ట్రిపుల్ ఐటి, ఇతర విద్యాసంస్థల్లో ప్రవేశాలు కల్పించేందుకు కృషి చేసిన ప్రిన్సిపల్ సాజిదా బేగంను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సాజిదా బేగం కళాశాల అభివృద్ధి కోసం చేసిన కృషికి అవార్డులు రావడం అభినందనీయమన్నారు. ఇటీవల పాఠశాలలోని 77 మంది విద్యార్థుల్లో 32 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపిక కావడం ఆమె కృషికి నిదర్శనమని తెలిపారు. అనంతరం అధ్యాపకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. అన్ని రకాల గురుకులాలను ఒకే డైరెక్టరేట్ పరిధిలోకి తీసుకురావాలని, విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని ఆయన కోరారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని, ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. గురుకులాలకు గతంలో ఉన్న ప్రత్యేక పిఆర్‌సిని పునరుద్ధరించాలని కోరారు. ఆర్‌జెయుపి రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం, అధ్యాపకులు సుధాకర్, హబీబ్, పాండురంగ, వసంత కుమార్ పాల్గొన్నారు.

జెఎల్‌ల సమస్యలు పరిష్కరించాలి

ఆస్పరి : ఆస్పరి జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి అధ్యాపకుల సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జూనియర్ అధ్యాపకులు పదోన్నతుల్లేక కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను జూనియర్ అధ్యాపకులకు పదోన్నతులు కల్పించి భర్తీ చేయాలని కోరారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ నరసింహంకు జిఒల పుస్తకాన్ని అందజేశారు. ఆర్‌జెయుపి రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజు, వీరబ్రహ్మం, సిపిఎస్ సంఘం నాయకులు రాంభూపాల్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రాము, మురళీ పాల్గొన్నారు.



ఆస్పరిలో ప్రిన్సిపల్‌కు జిఒల పుస్తకాన్ని అందజేస్తున్న శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి
శుక్రవారం 25 నవంబర్ 2022 5
నంద్యాల



దళితుల స్మశాన వాటికలు ఆక్రమణ

- రికార్డుల్లో ఎకరాల భూమి ఉన్నట్లు నమోదు
- క్షేత్ర స్థాయిలో కనిపించని స్థలాలు
- రోడ్ల పక్కనే ఖననం చేస్తున్న దళితులు
- చివరి మజిలీకీ తప్పని చిక్కులు..

ప్రజాశక్తి - కొత్తపల్లి : సమాజంలో దళితులు అనిర్వాంతం నుంచి నేటి ఆధునిక యుగం వరకు పెత్తందార్ల ఆగడాలతో అడుగడుగునా అవమానాలు, వివక్షకు గురవుతూనే ఉన్నారు. చివరికి ఆఖరి మజిలీ కోసం కేటాయించిన స్మశాన వాటికలను సైతం ఆక్రమించుకోవడంతో దళితులకు చిక్కులు తప్పడం లేదు. భూ రెవెన్యూ రికార్డుల్లో భూములున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం కన్పించడం లేదు. ఆక్రమణదారులను ప్రశ్నిస్తే దళితులపై దాడులకు దిగుతున్న పరిస్థితులున్నాయి. చేసేది లేక దళితులు మృతదేహాలను రోడ్ల పక్కన ఖననం చేస్తున్న దుస్థితి నెలకొంది.

కొత్తపల్లి మండలంలో 12 గ్రామ పంచాయతీలు, 33 మజరా గ్రామాలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో దళితులకు 3 నుంచి 5 ఎకరాలు స్మశాన వాటిక కోసం ప్రభుత్వం కేటాయించింది. కానీ క్షేత్ర స్థాయిలో 60 నుంచి 80 సెంట్లు కూడా లేని పరిస్థితులున్నాయి. 15 నుంచి 20 ఏళ్ల క్రితం ఆయా గ్రామాల్లో పెత్తందార్లు దళితులను బెదిరించి స్మశాన వాటికలను ఆక్రమించుకుని పంటలు సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నారు. అందులో ప్రధానంగా కొత్తపల్లి



రోడ్డు పక్కనే అంత్యక్రియలు చేసిన దృశ్యం

మండల కేంద్రంలో స్మశాన [illegible] ఖననం చేస్తున్నారు. అలాగే పెద్ద గుమ్మడాపురం, చిన్న గుమ్మడాపురం గ్రామాల్లో స్మశాన వాటికలేక ఎక్కడ పడితే అక్కడ ఖననం చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు ఉన్నాయి. కొక్కెరంచ, గువ్వలకుంట గ్రామాల్లో వర్షాకాలంలో మృతదేహాలను స్మశాన వాటికలకు తీసుకెళ్లాలంటే రహదారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్మశాన వాటికకు వెళ్లేందుకు వీలు లేకుండా మోకాలు లోతు నీటిలో వెళ్లి ఖననం చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇక ఎర్రమఠం, ముసలిమడుగుతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఎకరా నుంచి 2, 3 ఎకరాల వరకు ఉన్న స్మశాన వాటికలను పెత్తందార్లు ఆక్రమించుకున్నారు. అలాగే గ్రామాల్లో ఉన్న స్మశానాల్లో నేటికీ ప్రహరీ గోడలు, నీటి సౌకర్యం లేక దళితులు ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి నెలకొంది. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆక్రమణకు గురైన స్మశాన వాటికలను గుర్తించి ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

దళితుల స్మశానాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలి



గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దళితుల స్మశానాలు ఆక్రమణకు గురికాకుండా అధికారులు చూడాలి. రికార్డుల్లో మాత్రం ఎకరాల భూమి ఉన్నా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. కొన్ని గ్రామాల్లో నేటికీ దళితులకు ప్రత్యేకంగా స్మశానాలు లేవు. ఎక్కడపడితే అక్కడ చనిపోయిన వారిని పూడ్చుకుంటున్న పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణకు గురవుతున్న స్మశానాలపై ప్రత్యేక దృష్టి సారించి కాపాడాలి. లేనిపక్షంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో అన్ని గ్రామ దళితులను ఏకం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

పశువులకు 'పత్తి' మేత



కర్నూలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తి పంట ఒక వైపు గులాబీ పురుగు, మరో వైపు నకిలీ విత్తనాల వల్ల నష్టపోయింది. సాగు చేసిన విస్తీర్ణంలో దాదాపు 70 శాతానికి పైగా పత్తి పంట సాగుకు వచ్చినా పత్తి రాకుండా పోయింది. దీంతో చాలా మంది రైతులు పత్తి పొలాలను దున్ని పశువులకు మేతగా వదిలేస్తున్నారు. అలాంటి ఈ చిత్రమే జూపాడుబంగ్లా మండలం పోతులపాడు వద్ద కంపించింది. రైతు నంద్యాల రామకోటి 3 ఎకరాల్లో పత్తి పంట సాగు చేసి దిగుబడి రాకపోవడంతో ఇలా పశువులకు వదిలేసారు.

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వేను వేగవంతం చేయండి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో గృహ నిర్మాణాల ప్రగతి, గర్భిణీ, బాలింతల్లో రక్తహీనత, గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన దరఖాస్తుల తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జగనన్న లేఔట్లలో గృహ నిర్మాణాలు ముమ్మరం చేసి గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహించి అధికారులందరూ జగనన్న కాలనీలు సందర్శించి సమస్యలను హౌసింగ్ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రతి లేఅవుట్‌కు రహదారి, నీటి వసతి, విద్యుత్ కనెక్షన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల కలెక్టరేట్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, డిఆర్‌ఒ పుల్లయ్య, హౌసింగ్ పిడి రామశేషు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

26న చలో రాజ్ భవన్

- జయప్రదం చేయండి : రైతు సంఘం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రైతాంగం పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించేందుకు పార్లమెంట్‌లో చట్టం చేయాలని కోరుతూ ఈ నెల 26న చేపట్టిన చలో రాజ్ భవన్ కార్యక్రమానికి జిల్లా రైతాంగం పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.రమేష్ కుమార్, ఎ.రాజశేఖర్‌లు కోరారు. గురువారం నంద్యాలలోని ఎన్జీవోస్ కాలనీలో ఉన్న టి నరసింహయ్య భవన్లో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడారు. గతంలో దేశవ్యాప్తంగా రైతాంగం చేసిన పోరాటాల సందర్భంగా ఢిల్లీలో స్వయంగా ప్రధానమంత్రి పంటల మద్దతు ధరపై పార్లమెంటులో చట్టం చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. హామీ ఇచ్చి సంవత్సర కాలం గడిచినా స్వామినాథన్ కమిషన్ సూచించిన విధంగా పంటల మద్దతు ధరలు నిర్ణయించలేదన్నారు. కానీ విత్తనాలు, ఎరువులు ధరలు విపరీతంగా పెంచి రైతులపై భారం మోపారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పంటల మద్దతు ధరలపై పార్లమెంటులో చట్టం చేయాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న విజయవాడలోని రాజ్ భవన్ ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా నకిలీ పత్తి విత్తనాలు, అధిక వర్షాల వల్ల పత్తి రైతులందరూ తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు వ్యవసాయ శాస్త్రవేత్తలతో పరిశీలన చేయించి నెల రోజులు గడిచినా నివేదిక ప్రకటించలేదన్నారు. ఫలితంగా పత్తి పంట వేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, వారిని ఆదుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని, నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించాలని, పంటల బీమా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే విధానాన్ని వ్యతిరేకిస్తున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి జగనమోహన్ రెడ్డి మాత్రం రాష్ట్రంలో మీటర్లు పెట్టి, రైతులందరిపై భారాలు వేయడానికి ప్రయత్నిస్తున్నాడని, ఈ విధానాన్ని రైతులందరూ వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామేశ్వరరావు, రామచంద్రుడు, సుబ్బరాయుడు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి : ఎస్పి

ప్రజాశక్తి - పాణ్యం

ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి ఉంచాలని, గ్రామాల్లో మహిళా పోలీసులు, వాలంటీర్ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డి సూచించారు. గురువారం పాణ్యం పోలీస్ స్టేషన్‌ను ఎస్పి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని, చట్ట పరిధిలో సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. మహిళా పోలీసులతో మాట్లాడి వారికి కేటాయించిన గ్రామాలలో మహిళపై జరుగుతున్న నేరాలపై, శాంతిభద్రతల విషయంలో, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి, సమాచారం సంబంధిత అధికారులకు అందించాలని ఆదేశించారు. పాణ్యం ఎస్‌హెచ్‌ఒతో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల్లో వృత్తి నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి త్వరితగతిన విచారణ పూర్తి చేసి, నిర్దేశిత కాల వ్యవధిలో కోర్టులో ఛార్జ్ షీట్ ఫైల్ చేసి, సమర్థవంతమైన ట్రయిల్ ద్వారా నిందితులకు కఠిన శిక్ష పడేలా చెయ్యాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన దిశ యాప్ పట్ల మహిళల్లో అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. పిడిఎస్ రైస్, గుట్కా, జూదం, అసాంఘిక కార్య కలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి పూర్తిగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు. మహిళల అదృశ్యం కేసులపై సత్వరమే స్పందించాలని, సమగ్ర విచారణ జరిపి ఆచూకీని కనుగొనాలని చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో వివిధ రకాల కేసులలో పట్టుబడిన వాహనాలను పరిశీలించి, వాటిని త్వరగా సంబంధిత అధికారుల అనుమతి తీసుకుని డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. ప్రజలతో పోలీసులు మైత్రి భావం పెంపొందేలా నడుచుకోవాలని సూచించారు. గ్రామాలలో శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నంద్యాల డిఎస్‌పి మహేశ్వర్ రెడ్డి, పాణ్యం సిఐ వెంకటేశ్వర రావు, ఎస్ఐ సుధాకర్ రెడ్డి, ఎస్‌పి సిసి ఫయాజ్ బాష తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి

'సున్నిపెంట'కు నిధులు మంజూరు చేయండి

- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోనశశిధర్‌ను కోరిన జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నూతనంగా ఏర్పాటైన సున్నిపెంట గ్రామపంచాయతీకి నిధులు మంజూరు చేయాలని నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోనశశిధర్‌ను కోరారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోనశశిధర్ జగనన్న స్వచ్ఛ సంకల్పం, వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం భూముల సర్వే, ఉపాధి హామీ, ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోనశశిధర్ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాలు, అన్ని మున్సిపాలిటీల్లో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేసి సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యంగా పని చేయాలని అన్ని సూచించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా తడి, పొడి చెత్తలను వేరు చేయడంతో పాటు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద లేబర్ బడ్జెట్ లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. ప్రయారిటీ బిల్డింగ్‌ల నిర్మాణ పనులు ముమ్మరం చేసి గడువులోగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. సామూహిక శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కింద గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలీడేషన్ తదితర రీసర్వే పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన సున్నిపెంట గ్రామపంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని కోరారు. సున్నిపెంట గ్రామపంచాయతీకి ఎన్నికలు కూడా నిర్వహించలేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత ప్రతిపాదనలు పంపాలని కమిషనర్ కలెక్టర్‌కు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పంచాయతీరాజ్ ఎస్ఈ రామమోహన్, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, డిపిఓ శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు



ఎమ్మెల్యే గంగులను సన్మానిస్తున్న గంధం రాఘవరెడ్డి

ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు నూతన కార్యవర్గానికి గ్రీన్ సిగ్నల్

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ నూతన కార్యవర్గం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నూతన మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా గంధం రాఘవరెడ్డి, నరహరిలతో నూతన కార్యవర్గం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి జీవో జారీ చేసింది. త్వరలోనే నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్‌గా ఎన్నికైన గంధం రాఘవరెడ్డి ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు బొకే అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గంధం రాఘవరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్‌కు, శాసనమండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డికి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డికు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. రైతు సంక్షేమానికి, రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఎంపికైన గంధం వీర రాఘవ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన విఒఎలు

రుద్రవరం : రుద్రవరం వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గంధం రాఘవ రెడ్డి ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎపి వైఎస్ఆర్ క్రాంతి పథం వివోఏ యూనియన్ ఆధ్వర్యంలో గంధం రాఘవరెడ్డిని గురువారం ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. యూనియన్ జిల్లా కన్వీనర్ ఎంవి నరసింహులు మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోరే వ్యక్తి గంధం రాఘవరెడ్డికి మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి దక్కడం హర్షించదగ్గ విషయమన్నారు. నాయకులు సుబ్బయ్య, చెన్నయ్య, గురుస్వామి, నాగార్జున, మరియమ్మ, లక్ష్మీదేవి, ప్రకా షామ్మ సుభాష్, అన్ని గ్రామాల వివోఏలు పాల్గొన్నారు.

అనాధలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

బనగానపల్లె : అనాధలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ కౌసల్యాదేవి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ సంక్షేమ నిధి కోసం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

బనగానపల్లె : పట్టణంలోని పోలీస్ సర్కిల్ ఆఫీస్ సమీపంలోని అహమ్మద్ కబీర్ సాహెబ్ ఉర్సు ఉత్సవాలు గురువారం ముస్లిములు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం గ్యార్మీ నెలలో ఉర్సు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గంధం, ఉరుసు మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గుడ్ షెప్పర్డ్ స్కూల్ భవనం పై నుండి కిందపడిన విద్యార్థి

- విరిగిన కాలు - ఆస్పత్రికి తరలింపు
- మూడ్రోజులు గడిస్తే గాని చెప్పలేమంటున్న వైద్యులు
- ఘటనపై పలు అనుమానాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని ఎన్‌జిఒ కాలనీలో ఉన్న గుడ్ షెప్పర్డ్ స్కూల్‌లో ఐదవ తరగతి విద్యార్థి వశీకర్ భవనం పైనుంచి కింద పడడంతో కాలు విరిగిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. భవనం పైనుండి పడినా ఎలాంటి రక్త గాయాలు కాకపోవడం, ఇది ప్రమాదవశాత్తు జరిగిందా..? ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడా..? టీచర్లే విద్యార్థిపై దాడి చేశారా అనే కోణాల్లో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యార్థి ఉదయం 9 గంటల ప్రాంతంలో ఐదవ అంతస్తు భవనం నుండి కింద పడటంపై విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. యాజమాన్యం, టీచర్లు హుటాహుటిన విద్యార్థి వశీకర్‌ను ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. బయటకు కనపడని దెబ్బలు తగిలాయి. విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండడంతో మూడు రోజులు దాటితే గాని చెప్పలేమని వైద్యులు అంటున్నట్లు బంధువులు పేర్కొన్నారు. ఇది భవనం పైనుండి పడింది కాదని, స్కూల్ టీచర్లు, యాజమాన్యమే పిల్ల వాడిని ఏదో చేశారని విద్యార్థి బంధువులు ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చిన యాజమాన్యం అక్కడ దెబ్బతిన్న కుడి కాలికి కట్టు కట్టించి అక్కడినుండి ప్రైవేట్ ఆస్పత్రి ఉదయానందలో చేర్పించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంటే కేసు అవుతుందనే ఉద్దేశంతో మెరుగైన వైద్యం పేరుతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారని, గతంలో కూడా ఇదే స్కూల్లో ఓ విద్యార్థినీ ఆత్మహత్యయత్నం చేసుకుందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. బిల్డింగ్ పై నుంచి విద్యార్థి పడిపోవడానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

కాలుజారే పడినట్లు చెప్తున్నారు : డిప్యూటీ డిఇఒ

గుడ్ షెప్పర్డ్ స్కూల్‌లో విద్యార్థి వశీకర్ కాలుజారి పడ్డాడని ట్యాంక్ నిండిందా లేదా అని చూడడానికి వెళ్తున్న వాచ్‌మెన్, వెంట వెళ్లిన తోటి విద్యార్థులు చెప్తున్నారని జిల్లా విద్యాశాఖ ఉప విద్యాధికారి బేగ్ పేర్కొన్నారు. విద్యార్థి బోర్లా పడడం, రిబ్స్ పైన బలంగా పడడంతో దెబ్బ తగలడంతో పాటు కుడి కాలు విరిగిందని తెలిపారు.



విద్యార్థి కాలుకు కట్టు కట్టి ప్రయివేటు ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నంద్యాల అర్బన్ : విద్యార్థి వశీకర్ ఆత్మహత్య యత్నానికి కారణమైన స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగ రాముడు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడులు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎస్ఎండి.రఫీ ఈ సంఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

'వైఎస్ఆర్ చేయూత'పై అవగాహన కార్యక్రమం

ఉయ్యాలవాడ : ఉయ్యాలవాడలోని మండల మహిళా సమాఖ్య భవనంలో వైఎస్ఆర్ చేయూత లబ్దిదారులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి వెటర్నరీ డాక్టర్స్ రాజేంద్ర రెడ్డి, నాగ శైలజ, శ్రీలక్ష్మి, రాయల్ రెడ్డిలు హాజరై మాట్లాడారు. విఒఎలు, ఆర్‌బికె సిబ్బంది కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి ఏమి అవసరం అవుతాయో (ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, పొట్టేళ్ళు) కనుక్కోవాలన్నారు. ఒక యూనిట్ రూ. 75 వేలు కాగా ఇందులో చేయూత మొత్తం రూ.18,750 కింద వస్తుందని, మిగిలిన మొత్తం రూ.56,250 బ్యాంకు ఋణంగా, స్త్రీనిధి, ఎస్‌సి, ఎస్‌టిలు అయితే ఉన్నతి ఋణంగా ఇప్పించి వారికి ఆర్థికంగా తోడ్పాటును అందించాలని సూచించారు. విఒఎలు ఈ నెల అఖరుకు లబ్ధిదారుల జాబితా పూర్తి చేసి బ్యాంకులకు డిసెంబర్ 22 నాటికి అందజేయాలన్నారు. ఎపిఎం, విఒఎలు, ఆర్‌బికె, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెటర్నరీ డాక్టర్లు

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

రుద్రవరం : మండలంలోని చందలూరు గ్రామంలో జరిగిన హత్య కేసులో నిందితుని అరెస్ట్ చేసినట్లు సిరివెళ్ల సిఐ చంద్రబాబు నాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 15న జరిగిన గుండుమల్ల పెద్ద సంజన్న హత్య నేరానికి సంబంధించిన ముద్దాయి బోయ రాం పుల్లయ్య అలియాస్ రాంపులిని ఆర్ కొత్తూరు గ్రామం బయట లచ్చుమ్మ సమాధి వద్ద ఆళ్లగడ్డ ఎస్డిపిఓఐ సుధాకర్ రెడ్డి, సిరివెళ్ల సిఐ చంద్రబాబు నాయుడు, రుద్రవరం ఎస్ఐ నిరంజన్ రెడ్డి సిబ్బందితో కలిసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

ప్రయాణికుల సంతోషమే ఆర్‌టిసి ధ్యేయం : డిఎం

మహానంది : ప్రయాణికుల సంక్షేమం, సంతోషమే ఆర్‌టిసి ధ్యేయమని నంద్యాల డిఎం ఎ.గంగాధర్ తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికుల సంతోష వారోత్సవాల సందర్భంగా గురువారం ఆయన మహానంది క్షేత్రంలోని ఆర్టీసీ ప్రయాణికులను కలిసి మాట్లాడారు. బస్సుల వల్ల, డ్రైవర్, కండక్టర్ వల్ల ఏవైనా అసౌకర్యాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులకు ఇంకో బస్సు సర్వీసు కూడా త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. బస్సు షెల్టర్ కోసం కూడా చర్యలు తీసుకుంటామన్నారు. నంద్యాల ఆర్టీసీ సిఏ మద్దిలేటి నాయుడు, డిప్యూటీ సూపర్డెంట్ ఎన్ఎండి.భాష, సహాయకులు షేక్ అస్లాం పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

అవుకు : మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా భర్తపై కూడా చేయి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ అన్నవరం గ్రామానికి చెందిన కొంగాని సావిత్రి పొలంలోకి అదే గ్రామానికి చెందిన నక్క మల్లికార్జున నీళ్లు వదిలాడు. దీంతో సావిత్రి పొలానికి నీళ్లు అధికంగా వచ్చి పంట నష్టం జరుగుతోందని మల్లికార్జునను అడిగినందుకు అతను ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, ఆమె భర్త లక్ష్మీ పుల్లయ్యపై దాడి చేశాడన్నారు. సావిత్రి ఫిర్యాదు మేరకు నక్క మల్లికార్జునపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అయ్యప్ప స్వాములకు ఎస్ఐ బిక్ష

కొలిమిగుండ్ల : కొలిమిగుండ్లలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్పమాలధారులకు ఎస్ఐ రమేష్ రెడ్డి గురువారం భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాల ధరించిన అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : కమిషనర్

నంద్యాల అర్బన్ : నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా మని మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి అన్నారు. గురువారం పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. 32వ వార్డు బొమ్మల సత్రం వద్ద గల విజయపురి కాలనీలో కొత్త డ్రైన్‌ను నిర్మించాలని కాలనీవాసులు కోరారు.

యర్రగుంట్లలో ఎల్ఇడి బల్బులు ఏర్పాటు

శిరివెళ్ల : మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో కొత్త విద్యుత్ లైన్‌తో పాటు మరమ్మతులకు గురైన వాటి స్థానంలో నూతన ఎల్ఇడి స్ట్రీట్ లైట్లను గురువారం అమర్చారు. ఈ సందర్భంగా సర్పంచి అయ్యాలూరి సుభాన్ అలీ మాట్లాడుతూ గ్రామంలోని నూతన కాలనీలకు 16 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ఎల్ఈడి విద్యుత్ బల్బులు అమర్చినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల భిజేంద్ర రెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షుడు గాజా కృష్ణారెడ్డి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

'జల్ జీవన్ మిషన్'ను కేంద్ర బృందం పరిశీలన

బనగానపల్లె : మండలంలోని తమ్మడపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని నిలువుగండ్ల, జమ్మలదిన్నె గ్రామాలలో జల్ జీవన్ మిషన్ పనులను కేంద్ర బృందం సభ్యులు ఏన్ వాష్ ఎక్సపర్ట్స్ చిరంజీవి సైకియా, ఈఆర్‌జిఏ.బేగ్‌లు గురువారం పరిశీలించారు. ఇంటింటికి వేసిన కుళాయిలను, పైపులైను, ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఇంజినీరింగ్ ఆఫీసర్ సి.హెచ్. మనోహర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ, జెజెఎం జిల్లా ప్రాజెక్టు మానిటరింగ్ సభ్యులు విజయరాజు, భీమాశంకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గజ్జల రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జరగనుంది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే గంగుల హాజరు కానున్నారని ఎంపీడీవో సుబ్బారెడ్డి తెలిపారు. ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్లు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ అధికార సిబ్బంది సమావేశానికి ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు.

ముద్దాయికి 14 రోజుల రిమాండ్

ఉయ్యాలవాడ : మండలంలోని గోవింద పల్లె గ్రామానికి చెందిన తుమ్మలూరు దస్తగిరి రెడ్డిని ఎస్‌సి, ఎస్‌టి కేసులో 14 రోజుల పాటు రిమాండ్కు తరలిస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. తుమ్మలూరు దస్తగిరి రెడ్డి 2020లో ఎస్సీ ఎస్టీ కేసులో ముద్దాయిగా ఉన్నారని, కోర్టులో వాయిదాలకు సరిగా హాజరుకానందున కర్నూలు కోర్టు జడ్జి అరెస్టు వారెంటు ఇవ్వడంతో 14 రోజులపాటు రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.


అధ్వానస్థితిలో సంజామల-కొత్తపల్లి రోడ్డు

సంజామల : సంజామల నుంచి కొత్తపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు కంకర తేలి నడవడానికి కూడా వీలు లేకుండా అధ్వానంగా మారింది. గతంలో రెండు మూడుసార్లు రోడ్డు వేయాలని ప్రజలు, వాహనదారులు విన్నవించినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు రెండు సంవత్సరాల నుంచి రహదారి మొత్తం కంకర తేలి ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బైక్‌లు కొన్ని సందర్భాల్లో అదుపు తప్పి కింద పడిన సంఘటనలూ ఉన్నాయి. రైతులు పొలాలకు ఈ రోడ్డు మీదుగానే వెళ్లాల్సి ఉండడంతో ఎద్దుల బండ్లు, వ్యవసాయ కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కంకరను తొలగించి నూతనంగా రహదారి వేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలిన సంజామల-కొత్తపల్లి రోడ్డు

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద గుర్తు తెలియని శవం


నీటిపై తేలాడుతున్న గుర్తు తెలియని శవం

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద గురువారం గుర్తు తెలియని శవం లభ్యమైంది. గేట్ల వద్ద నీటిపై తేలాడుతుండటంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎవరైనా హత్య చేసి ఇక్కడ పారేశారా? లేక నీటిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారా? లేదా హర్వేస్ వల లాగే క్రమంలో మత్స్యకారుడు ప్రమాదవశాత్తు జారి పడ్డారా అన్నది తేలాల్సి ఉంది. పోతిరెడ్డిపాడు సమీపంలో విస్తరణ పనుల కోసం ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చారు. కూలీల్లో ఎవరైనా ఇక్కడ మరణించారా అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

రాష్ట్రంలో అరాచక పాలన : సోమిశెట్టి

ప్రజాశక్తి - చాగలమర్రి


సోమిశెట్టి వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న టిడిపి నేతలు

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రమైన చాగలమర్రి అభి హోటల్ ప్రాంగ ణంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇదేం కర్మ అని అనుకుంటున్నారన్నారు. ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతం అయిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని అన్నారు. కష్టపడి పనిచేసే వారికి తెలుగుదేశం గుర్తింపు సరైన స్థానం కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ సోషల్ సల్లా నాగరాజు, గుత్తి నరసింహులు, గాయక మోహన్ పాల్గొన్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పార్కు పరిరక్షణ



పార్కును సందర్శిస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి - డోన్

ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పార్కు పరిరక్షణ బాధ్యతలను తీసుకున్నట్లు ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీ ఆర్ఓ శాంతి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని తారకరామనగర్ దగ్గర గల పార్కును ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇన్నర్ వీల్ క్లబ్ సంస్థ ప్రజలకు చేసే సేవలను గుర్తించి తారకరామనగర్ దగ్గర గల పార్కు పరిరక్షణ బాధ్యతలు ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులకు అప్పగించారు. ఈ బాధ్యతను సంతోషంగా స్వీకరించి బాధ్యతతో న్యాయం చేస్తామని తెలిపారు. పార్కును ఆహ్లాదకరంగా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ బాధ్యతను అప్పగించిన మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ సప్త శైల రాజేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు సుమిత్ర, రాజసుజాత, రాజకుమారి, శారద, అనంత లక్ష్మి, షాలిని, పద్మ, మధ్యమ్మ, మంజుల, సూర్యకుమారి, విమలమ్మ, అనూరాధ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - ఆత్మకూర్


క్రీడాకారున్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఈ నెల 25న విజయ నగరంలో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన ఆత్మకూరు పట్టణానికి చెందిన ఉపేంద్ర అనే క్రీడాకారుడికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆర్థిక చేయూతనందించారు. గురువారం పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆర్థిక సాయం చేసి మాట్లాడుతూ బాగా ఆడి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గతంలో ఎమ్మెల్యే కుమారుడు శిల్పా కార్తీక్ రెడ్డి కూడా ఆర్థిక సహకారం అందించడంతో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచినట్లు క్రీడాకారుడు గుర్తు చేశారు. అనంతరం క్రీడాకారుడిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో క్రీడాకారుడు, కౌన్సిలర్ సుల్తాన్, సీనియర్ క్రీడాకారుడు ఎఎండి. రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు నియోజకవర్గంలో గ్రామీణ రహదారుల నిర్మాణానికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేసిందని గ్రామీణ ప్రాంతాల్లో గతుకు లమయ మైన రోడ్లకు మహర్దశ పట్టనుందని నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ అన్నారు. నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామం వరకు బీటీ రహదారి నిర్మాణమునకు గురువారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.65 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిన్న నాగ లక్ష్మయ్య, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు మురళీకృష్ణా రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ హాజీ అబ్దుల్ సుకూర్, బ్రాహ్మణ కొట్కూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ మద్దూరు హరి సర్వోత్తమ రెడ్డి, నందికొట్కూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ సగినేల ఉసేనయ్య, రహదారులు భవనాల శాఖ డిఈ సురేష్, ఏఈ మనోహర్, వైసిపి నాయకులు ప్రభాకర్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, ఉదయ్ కిరణ్ రెడ్డి, శ్రీనివాసులు, మల్లాల చిన్నస్వామి, బిజినవేముల మహేష్, కుమ్మరి వెంకట స్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండేవిధంగా బాధ్యత తీసుకోవాలి

- ఐసిడిఎస్ పిడి లీలావతి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ప్రతి ఇంటిలో మహిళలు, పిల్లలు ఆరోగ్యంగా ఉండే విధంగా అంగన్వాడి హెల్త్ వర్కర్లు, ఆశా వర్కర్లు, మహిళా పోలీసులు బాధ్యత తీసుకోవాలని ఐసిడిఎస్ పిడి లీలావతి అన్నారు. గురువారం ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాల నందు ట్రైనింగ్ ఇన్ మిషన్ రీచ్ ఫర్ ఎస్ ఐ జి గర్ల్స్ ప్రోగ్రాం ప్రాజెక్టు డైరెక్టర్ నంద్యాల జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ వి.లీలావతి ఆధ్వర్యంలో హెల్త్ వెల్నెస్ సెంటర్ సిహెచ్ఓ లకు గ్రామ సచివాలయ హెల్త్ సెక్రటరీలు, విలేజ్ మహిళా పోలీసులు, అంగన్వాడి టీచర్లకు, ఆశలకు రెడ్యూస్ మాల్ న్యూట్రిషన్, ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, ఎనిమియా మేనేజ్మెంట్, చైల్డ్ మ్యారేజ్, హైజీన్లపై ట్రైనింగ్ ప్రోగ్రామ్ను నిర్వహించారు. నందికొట్కూరు సిడిపిఓ కోటేశ్వరి, ఆర్బిఎస్కె సిహెచ్ఓ తేజస్విని, ఎస్ బి ఎస్ పి విజయ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ వి.వి రమణ, హెల్త్ ఎడ్యుకేటర్ పి హెచ్సి గొస్పాడు గ్రేడ్ వన్ అంగన్వాడి సూపర్వైజర్ పద్మావతి ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా కర్నూలు పెద్ద మస్తాన్ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ టిబి యూనిట్ ఆత్మకూరు వారు టిబిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసి డి ఎస్ సూపర్వైజర్లు విజయ కుమారి, దేవ జయమ్మ, సూర్య కుమారి, కుమారి హెల్త్ వెల్నెస్ సెంటర్ సి హెచ్ఓలు సచివాలయ ఆరోగ్య సెక్రటరీలు, అంగన్వాడి టీచర్లు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తూ అండగా ఉన్నదని శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి, ఆత్మకూర్ మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా అన్నారు. గురువారం నాడు పట్టణంలోని 1,2,5వ సచివాలయాల పరిధిలో ఉన్న వార్డులలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికి వెళ్లి ఆ ఇంటిలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలను వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే చర్యలు తీసుకుంటామని, గ్రామ సమస్యలను కూడా తమ దృష్టికి తీసుకొని రావాలని ప్రజలకు సూచన చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రాజగోపాల్, కోఆప్షన్ సభ్యుడు ఎంఎ రషీద్, కౌన్సిలర్లు మారుబోతుల విజయ, విజయ్ చౌదరి, ప్రకాష్ రావు, రంగస్వామి, సుల్తాన్ యూనుస్, పాణ్యం పార్వతి తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** మండలంలోని కోళ్ల బావాపురం గ్రామంలో గడపగడపకు ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్థర్ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి పథకాలను వివరించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆర్థర్ సొంత పార్టీ సర్పంచ్ కృష్ణ వేణమ్మ నిలదీశారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వర్గానికి చెందిన గ్రామ సర్పంచ్ కృష్ణవేణమ్మ, వైసిపి ఇన్చార్జ్ నాగార్జున, సొంత పార్టీ లోనే తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పార్టీలో మొదటి నుంచి పనిచేస్తున్న తమపై సొంత పార్టీ వారే కేసులు


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

వేశారన్నారు. ఇప్పటి వరకు 13 కేసులు నమోదు చేశారన్నారు. ఇదంతా మీవద్ద ఉంటున్న వ్యక్తులే చేస్తున్నారన్నారు. గ్రామంలో రోడ్డు వేయాలని స్వయంగా మీవద్దకు వచ్చినా పని కాలేదని వారి వాపోయారు. కార్యక్రమంలో మద్దూర్ హరి సర్వోత్తమ రెడ్డి, ఉదయ్ కిరణ్ రెడ్డి, ఎంపీడీవోశోభారాణి, నాగటూరు సుధాకర్ రెడ్డి, తాసిల్దార్ రాజశేఖర్ బాబు, సింగిల్ విండో చైర్మన్ ఉషనయ్య, బోరెల్లి రఘు, వైసిపి ఇన్చార్జి వెంకటేశ్వర్లు, దామగట్ల రత్నం, ముడియాల, వెంకట రమణారెడ్డి, వేల్పుల నాగన్న, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పాల్గొన్నారు. **చాగలమర్రి :** ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని గ్రామ,గ్రామానా నిర్వహిస్తున్నా మని ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని నేలంపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ప్రజలు లబ్ధిపోందిన వివరాలను తెలిపి సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బాబులాల్,మండల కన్వీనర్ కుమార్రెడ్డి,ఎంపిపి వీరభద్రుడు, సర్పంచ్ ప్రతాప్రెడ్డి, ఎంపిటీసిలు బేబమ్మ,పత్తినారాయణ, లక్ష్మిరెడ్డి, నరసింహులు, ఫయాజ్,ఉపసర్పంచ్ సోహెల్,తహసీల్దారు విజయ్ కుమార్,ఎంపిడీఓ చంద్రశేఖర్,డిఈ నరసింహులు, ఎంఈఓ అనురాధ, ఏఓ రంగనేతాజీ,హెఓ నరేష్ కుమార్ రెడ్డి ఏఈలు కొండారెడ్డి,జగ్గయ్య,షాజహాన్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుశీల,ఏపిఓ నిర్మల,సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి,సాగు నీటి సంఘ అధ్యక్షుడు అధ్యక్షులు శేసు రమేష్,నాయకులు నాగేశ్వర రావు యాదవ్, నారాయణరెడ్డి,వెంకటేశ్వర రెడ్డి,జగదీశ్వర రెడ్డి,వెంకట సుబ్బారెడ్డి,పెద్దరాముడు,నాయుడు,రమణా రెడ్డి,హుసేన్వలి పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** మండలంలోని పుసులూరు గ్రామంలో 61వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డికి విద్యార్థులు కోలన్నలతో స్వాగతం పలికారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి అడిగారు. చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఎంపీడీవో భాస్కర్, గ్రామ సర్పంచ్ పాలుట్ల రాము, అడ్వకేట్ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, ఎంపిటిసి ముక్కర సుదర్శన్ రెడ్డి, సూరజ్ రామిరెడ్డి, వైసిపి మండల నాయకులు మహేశ్వరరెడ్డి, బసవేశ్వర రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా కార్యాచరణ ప్రణాళిక

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

నంద్యాల కలెక్టరేట్ : లింగ వివక్షతకు వ్యతిరేకంగా పక్కా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఆ మేరకు గ్రామ, మండల స్థాయిలో సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఛాంబర్లో లింగ వివక్షతపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుండి వచ్చే నెల 23వ తేదీ వరకు నెలరోజుల పాటు గ్రామ, మండల స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసి కార్యక్రమాలు నిర్వహించేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలు నిర్వహించడం కోసం గ్రామ, మండల స్థాయిలో కోఆర్డినేషన్ కమిటీలను కూడా ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, డియంహెచ్ఓ వెంకటరమణ, డిఆర్డిఏ - వైకెపి ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.బి శ్రీధర్ రెడ్డి, డ్వామా పిడి రామచంద్ర రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి లీలావతి, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్, సాంఘిక సంక్షేమ శాఖ ఈడి చింతామణి, డిఎల్డిఓ జనార్దన్ రావు, అధికారులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలను నమ్మకండి : ఇఒ

శ్రీశైలం : ఆలయాల ఘటనలపై అసత్య ప్రచారాలను నమ్మకండి అని శ్రీశైల దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి లవన్న భక్తులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో ఎక్కడో ఆలయంలో జరిగిన సంఘటనలను శ్రీశైల క్షేత్రంలో జరిగినట్లుగా కొందరు సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నట్లుగా దేవస్థానం దృష్టికి వచ్చిందని అన్నారు. ఆ వీడియోలో ఆలయంలో వేద పండితులకు భక్తులకు సరైన గుర్తింపు లేదని తెలుపుతున్నట్లుగా ఉందని అవి వాస్తవాలు కాదన్నారు. ఈ సంఘటన శ్రీశైలంలోనే జరిగిందని కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, శ్రీశైల దేవస్థానం ప్రఖ్యాతి ప్రతిష్టలు భంగం కలిగించే విధంగా ప్రయత్నిస్తున్నారని అన్నారు.

జిల్లా మహాసభలు జయప్రదం చేయండి : వ్యకాసం

ప్రజాశక్తి - బేతంచెర్ల


ఆటో జాతను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్ ఈశ్వరయ్య

మండల కేంద్రంలో జరుగు వ్యవసాయ కార్మిక సంఘం రెండవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్ ఈశ్వరయ్య, సీనియర్ నాయకుడు వై ఎల్లయ్య కార్మికులను, ప్రజలను వారి కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు జయప్రదం చేయాలని గురువారం నాడు బేతంచర్లలో ఆటో జాతను వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ ఎన్ హైమావతి వ్యవసాయ కార్మిక సంఘం జెండా ఊపి జాతను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం కార్మికులకు వారి కుటుంబాలకు ఉపాధి, విద్య, వైద్యం అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమై అయ్యాయన్నారు. రెండు రోజులపాటు జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలలో పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించడం జరుగుతుందని వారన్నారు. మహాసభల సందర్భంగా మొదటి రోజు జరుగుతున్న ర్యాలీ బహిరంగ సభకు. ఉపాధి కూలీలు, ప్రజలు కార్మికులు, అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు సిఐటియు కార్మికులు ఎస్ఏ కలాం, స్వామి నాయుడు, రాజబాబు, వెంకటరమణ, నర్సింహులు, నాగరాజు, వెంకటసుబ్బయ్య, మాలిక్ బాషా, రామళ్లకోట బాష, శ్రీనివాసులు, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ ట్రస్ట్కు రూ. 5 లక్షలు విరాళం

ప్రజాశక్తి - నంద్యాల


విరాళం చెక్కును అందచేస్తున్న దస్తగిరి రెడ్డి

కోవెలకుంట్ల తాలూకా మంగపల్లి గ్రామంలో దివంగత పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి స్మారకార్థం నిర్వహిస్తున్న పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్కు గురు రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి గురువారం రూ. 5 లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వైయస్సార్ అచీవ్మెంట్ అవార్డును బ్యాంకింగ్ రంగంలో చేసిన కృషికి ప్రత్యేకంగా తనకు అవార్డుతో పాటు రూ. 5 లక్షల నగదు పారితోషికంగా అందజేశారని తెలిపారు. స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి స్ఫూర్తితో తన వంతుగా సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో తమ తండ్రి స్మారకర్థం స్వగ్రామమైన మంగపల్లి గ్రామంలో పది ఎకరాల విస్తీర్ణంలో హాస్పిటల్ నిర్మించి కోవెలకుంట్ల, సంజామల మండల పరిసర ప్రాంత గ్రామ ప్రజలకు సేవ చేయాలని ప్రతి నెల చివరి ఆదివారం మెడికల్ క్యాంపు నిర్వహిస్తూ 1500 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తూ భోజనం వసతి కల్పిస్తున్నామన్నారు. గర్భిణులకు అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేశామని, పేదవారికి వివాహాలు నిర్వహించుకోవడానికి ఉచిత కళ్యాణ మండపాన్ని నిర్మించి అందరికీ అందుబాటులో తీసుకొచ్చామన్నారు. దాదాపు ఐదు సంవత్సరాల నుండి ఉచిత మెడికల్ క్యాంపు ద్వారా అనేక రకాల పరీక్షలు నిర్వహించి తనవంతుగా సేవ చేస్తున్నానని, ప్రభుత్వాలు ఇచ్చిన పారితోషకాన్ని చారిటబుల్ సొసైటీకి అందజేసినట్లు తెలిపారు. రూ. 5 లక్షలు నగదు పారితోషకాన్ని చారిటబుల్ సొసైటీ ప్రతినిధులు బాలిరెడ్డి శంకర్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో గురు రాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు పి మౌలాలి రెడ్డి, షేక్షావలి రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


పంటకు రక్షణ పంటను వేసుకోవాలి ఏ ఈ ఓ

ప్రజాశక్తి - పాములపాడు

సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఎఇఒ మద్దిలేటి అన్నారు. మండలంలోని లింగాల గ్రామంలో మినుము పంట వేసుకునే రైతులకు ఏఈఓ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి బాల మల్లేశ్వర రెడ్డి, గ్రామ స్థాయి వ్యవసాయ సలహా మండలి సభ్యులు, గ్రామ రైతులు పి సాములు, గంట ప్రభాకర్, పొలంబడి నిర్వహకుడు రమాపతి, విహెచ్ఏ విజయ్, ఎం పిఈఓ సునీత, ఎంపీఈవో మున్నా, రైతులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మల్యాల వ్యవసాయ అధికారి శాంతరాజు రైతులకు సూచించారు. గురువారం మండలంలోని మల్యాల గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వరి, పత్తి, మిరప పంటలను పరిశీలించారు. పత్తి పంటల రసం పీల్చే పురుగు గులాబీ రంగు పురుగు, తల మారు తెగులు, కాయ కుళ్ళు, తెగులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు.

వైఎస్ఆర్ బీమా సాయం పంపిణీ

ప్రజాశక్తి - నందికొట్కూరు

పట్టణంలోని 1వ వార్డులో మృతి చెందిన కాటే పోగు శేఖర్ కుటుంబానికి వైయస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలను వార్డు కౌన్సిలర్ కాటేపోగు చిన్న రాజు, సచివాలయ అడ్మిన్, విజయ్, ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ రవికుమార్ గురువారం అందజేశారు. కౌన్సిలర్ చిన్న రాజు మాట్లాడుతూ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదేశాల మేరకు వారి కుటుంబానికి ప్రభుత్వ పరంగా అన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమార్ రాజా, లక్కీ, వాలంటీర్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని కోటగడ్డ వీధికి చెందిన హేక్ సమీరాకు మేజర్ గ్రామ పంచాయతి సర్పంచ్ తులశమ్మ వైఎస్సార్ బీమా కింద తక్షణ సహాయంగా రూ 10వేలు గురువారం అందజేసారు. మిగిలిన మొత్తం త్వరలో నామిని ఖాతాలో జమ అవుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ముల్లా రఫీ, వైసిపి నాయకులు బసమ్మగారి మహబూబ్బాష, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మిడుతూరు : మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన మాచర్ల చంద్రశేఖర్ నాయుడు కుటుంబానికి వైఎస్సార్ బీమాలో భాగంగా తక్షణ సహాయం కింద రూ.10,000 ఇఓఆర్డి ఫకృద్దిన్, సర్పంచ్ విద్యపోగుల జయలక్ష్మమ్మ, ఉప సర్పంచ్ లోకేశ్వర రెడ్డి అందజేశారు.

టిబి వ్యాధిగ్రస్తులకు ఎంపి రూ.4.50 లక్షలు విరాళం

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

క్షయ వ్యాధిని నిర్మూలించడానికి ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టిక ఆహారం అందించడానికి నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి నిక్షయ్ మిత్రగా చేరి రూ. 4 లక్షల 50 వేలు విరాళం గురువారం అందజేశారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలోని టిబి వ్యాధిగ్రస్తులలో పేదవారైన 150 మందిని దత్తత తీసుకొని వారికి నెలకు ఒకొక్కరికి 500 రూపాయల చొప్పున 6 నెలలకు రూ. వేలు పౌష్టిక ఆహార వస్తువులు అదించడానికి రూ. 4 లక్షల 50 వేల చెక్ను జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి నివారణ అధికారులు డాక్టర్లు బాలాజీ, మల్లికార్జున రెడ్డిలకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత, జయరామిరెడ్డి, స్వర్ణలత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు త్వరలోనే పరిష్కారం : తహశీల్దార్

అవుకు : మండలంలోని రైతులకు త్వరలోనే భూ సమ స్యలకు పరిష్కారం లభించనున్నదని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం అవుకు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో అజామ్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. మండల అధ్యక్షుడు చల్లా రాజశేఖర్ రెడ్డి పాల్గొని మొదట స్వర్గీయ ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటిం చారు. రెండు సంవత్సరాల వ్యవధిలోని తండ్రి కొడుకులను కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. అనంతరం సభలో తహశీల్దార్ మాట్లాడుతూ డోన్ డివిజన్లోని అవుకు, బనగానపల్లి, కోవెలకుంట్ల మండలాలకు భూ సర్వేను మొదట విడతగా చేపట్టేందుకు ఆదేశాలు వచ్చాయని, డిసెంబర్ లేదా జనవరిలో జరుగుతు ందని తెలిపారు. వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లా డుతూ సాగు చేసిన పంటలను 96 శాతం ఈకెవై సి చేశామన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారిని భారతి దేవి, ఏఈలు పకీరయ్య, కరిముల్లా, మహమ్మద్ గౌస్, విద్యాధికారి శ్రీధర్ రావు, ఐకెపి ఎపిఎం విజయ గోపాల్, ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగసుంకమ్మ, ఉప మండల అధ్యక్షుడు రామప్ప, కో ఆప్షన్ సభ్యుడు హుస్సేన్ మియా, ఈఓఆర్డి రామకృష్ణవేణి, ఈవో అశ్విన్ కుమార్, ఎంపీ టీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కాంగ్రెస్కు పూర్వ వైభవం రావడం ఖాయం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ



కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ కార్యదర్శి శంసుల్ హక్ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన గిడుగు రుద్రరాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు. గిడుగు రుద్రరాజు నియామకం వల్ల తమ పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్గా మస్తాన్ వలి, సుందర పద్మశ్రీ, గౌతమ్, రాకేష్ రెడ్డిలు ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రత్యేక హెూదా సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.3 లక్షలు రుణమాఫీ జరుగుతుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో బిజెపిని, ప్రాంతీయ పార్టీలను చిత్తు చిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు.

ఎయిడ్స్ అంటువ్యాధి కాదు

నంద్యాల కలెక్టరేట్ : ఎయిడ్స్ అంటువ్యాధి కాదని జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ బాలాజీ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఎయిడ్స్పైన కళాజాతా కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలాజీ మాట్లాడు తూ నంద్యాల జిల్లాలో 25 గ్రామాలలో హెచ్ఐవి/ఎయిడ్స్, రక్తదానం, ఏఆర్టి మందులు, ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. జిల్లా అధికారులు మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న జిల్లా వ్యాప్తంగా ఎయిడ్స్ పైన అవగాహనా కార్యక్రమాలు, హైరిస్క్ గ్రూప్స్ వారికి రక్త పరీక్షలు చేయాలనీ, దాతల సహకారంతో హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారం ఇచ్చేలా ప్రోత్సహించాలని సూచిం చారు. యువతి యువకులకు ప్రత్యేక కార్యక్రమాల ప్రణాళిక తయారు చేయాలని సూచిం చారు. కార్యక్రమములో వైద్యులు జగదీష్ చంద్ర రెడ్డి, మల్లికార్జున రెడ్డి, ఏఆర్టి నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు జిల్లా మేనేజర్ అలీ హైదర్, దేవిశంకర్, ఏఆర్టి, ఐసిటిసి సిబ్బంది, బ్లడ్ బ్యాంకు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల మేనేజర్లు, ఏపి సాక్స్ పార్టనర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టిసి డిఎం

డోన్ : ప్రయాణికుల కోసం డయల్ యువర్ డిఎం కార్యక్రమంను శుక్రవారం నుండి నిర్వహిస్తున్నట్లు ఏపీయస్ ఆర్టీసీ డోన్ డిపో మేనేజరు శశిభూషణ్ గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 తేదీన ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం డోన్ ఆర్టీసీ డిపో నందు నిర్వహించడం జరుగుతుందని, ప్రయాణీకులు ఫోన్ నెంబర్ 9959225795కు ఫోన్ చేసి సర్వీసులపై సందేహాలు, ఫిర్యాదులు, సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

ఓంకార దేవస్థాన హుండీ ఆదాయం లెక్కింపు

బండి ఆత్మకూర్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన శాశ్వత హుండీలను గురువారం ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి ఈవో మోహన్ పర్యవేక్షణ అధికారి నాగప్రసాద్ కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. హుండీ లెక్కించగా రూ.4 లక్షల 22 వేల 46లు ఆదాయం వచ్చిందని ఆలయ అధికారి తెలిపారు. 2021 సంవత్సరం కరోనా కారణంగా ఉండి లెక్కించలేదని ఈ సంవత్సరం ఉండి లెక్కించగా గతంలో కంటే ఇప్పుడు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారి విశ్వేశ్వరయ్య కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అక్కినేని ఫ్యాన్స్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నందికొట్కూరు

పట్టణంలోని మున్సిపాలిటీ ఒకటో వార్డులో అక్కినేని నాగార్జున వీరాభిమాని కాటే పోగు శేఖర్ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. కాటపోగు శేఖర్ కుటుంబానికి ఆర్థిక సాయం5 వేల రూ. అందజేశారు. అక్కినేని నాగార్జున ఫ్యాన్స్ మాట్లాడుతూ వారి కుటుంబానికి అండగా ఉంటామనితెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ రవికుమార్,నాగరాజు, నిమ్మకాయల మోహన్, స్వామన్న, కళాకర్, నిమ్మకాయల రాజు, రాజు, రవి, సుందరాజు, శాంత రాజు, చిన్ని, రాజేష్, ప్రవీణ్ రగడ, అఖిల్, లాలు, రషీక్, తదితరులు పాల్గొన్నారు..

క్రీడా స్ఫూర్తితో మెలగాలి : సర్పంచి

ప్రజాశక్తి - పగిడ్యాల

ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో మెలగాలని అప్పుడే విజయం సాధిస్తారని పగిడ్యాల సర్పంచు పెరుమాళ్ళ శేషన్న అన్నారు. గురువారం పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడారు. వైసిపి యువనాయకుడు ఎక్కలదేవి చంద్రమౌళి క్రీడా దుస్తువులు ఇచ్చారన్నారు. చంద్రమౌళి సహకారం తోనే క్రీడాకారులకు దుస్తువులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గెలుపు, ఓటమిని సమానంగా స్వకరించినప్పుడు విజయలు వరిస్తయన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముధు సూధనరావు,ఉపాధ్యాయులు రషీద్మియ్య, రమణరావు, మల్లయ్య, క్రీడాశ్రీ పితాంబరరెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయుడు రాగన్న పాల్గొన్నారు.

ఆధార్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలి

బండి ఆత్మకూర్ : ఈర్నపాడు గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ హక్ అన్నారు. గురువారం నాడు ఆయన ఆధార్ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. వెంగళ్రెడ్డి పేట, కడమల కాలువ, సింగవరం, సోమయాజుల పల్లె, మణికంఠపురం, నాయిని చెరువు గ్రామాల ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు : ఎడిఇ

ప్రజాశక్తి - రుద్రవరం

ఎవరైనా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ సహాయ సంచాలకులు సుబ్రమణ్యం తెలిపారు. గురువారం మండలంలోని నరసాపు రం గ్రామంలో ఉన్న విద్యుత్తు ట్రాన్స్ ఫారంను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి విద్యుత్ ట్రాన్స్ఫారం కావాలని దరఖాస్తులు చేసుకున్న రైతులకు గాను మండలానికి 58 విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేశామని, ఇంకా 23 రావాల్సి ఉందన్నారు. ఆయన వెంట విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

మెనూ చార్జీలు పెంచాలి : ఎస్ఎఫ్ఐ

ఆత్మకూర్ : పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా ప్రభుత్వం పాఠశాల మెనూలో డైట్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ ఆత్మకూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పి. ప్రేమ్, కే. దినేష్ కుమార్ ఆత్మకూరు మండల డిప్యూటీ తహశీల్దార్ సాయి విశ్వ తేజ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల కళాశాలలో పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకా లను అందించాలని, పెండింగ్లో ఉన్న హాస్టల్ విద్యార్థులకు కాస్మో టిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దిలీప్, సాయి, గంగాధర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కండి : సిఐటియు

ప్రజాశక్తి - నందికొట్కూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరడడానికి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగేశ్వరావులు పేర్కొన్నారు. గురువారం సిఐటియు రెండవ మహాసభ స్థానిక జై కిసాన్ పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జెండాను సిఐటియు సీనియర్ నాయకులు ఎస్ ఉస్మాన్ బాషతో కలిసి ఆవిష్కరణ చేశారు. అనంతరం మహాసభ సిఐటియు మండల అధ్యక్షురాలు ఆర్ జయ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏసురత్నం, ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్ శక్తులకు అమ్ముతూ.. దేశాన్ని దివాలా తీయిస్తోందని విమర్శించారు. రోజురోజుకు పెరిగిన ధరలతో ఉద్యోగులు, కార్మికులు మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యుత్ మోటార్ల బిల్లు 2022ను వెంటనే రద్దు చేసి, విద్యుత్ శాఖలో సంస్కరణలు నిలిపివేయాలని వారు కోరారు. కేంద్ర ప్రభుత్వ స్కీములో పనిచేస్తున్న అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజనం, వివోఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులకు కనీస వేతనం పెరిగిన ధరలకు అనుగుణంగా నెలకు రూ 26,000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరితే అరెస్టులతో ఉద్యమాలను అణచివేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కే భాస్కర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయ కులు పీ ఫకీర్, సాహెబ్, వ్యాకాస మండల ఉపాధ్యక్షులు వేణుగోపాల్, సిఐటియు నాయకులు కే మదిలేటి, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు మదార్బి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు నజరుని సా, వివోఎల సంఘం నాయకురాలు మహేశ్వరమ్మ, వీఆర్ఏ సంఘం నాయకులు వాసు, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

మొక్కల పెంపకంలో జాగ్రతలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - పగిడ్యాల


మొక్కలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

మొక్కల పెంపకంలో జాగ్రతలు పాటించాలని ఎంపిడిఒ వెంకటరమణ రైతులకు సూచించారు. గురువారం పగిడ్యాల గ్రామంలో పండ్లతోటను, మునగ తోటను,బ్యాక్ ప్ల్యాటిన పనులను పరిశీలించారు. ఈ సందర్బగా ఎంపిడిఒ మాట్లాడారు. పండ్లతోటలను పెంపోందించే విదంగా రైతులకు అవగాహన కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. పండ్ల తోటల పెంపకం వల్ల రైతులకు ఎంతో ఆయదయం ఉంటుందన్నారు. జాతీయ ఉపాధి హమీపథకం కింద మొక్కలను ఉచితంగా ఇస్తుందన్నారు. రైతులు పండ్ల తోటలు పెంపొందించేందుకు ముంకురావలన్నారు. ఎక్కడైన ప్రభుత్వ, బంజరు భూములుంటే మొక్కలు పెంపోందించే విదంగా చర్యలు తీసుకోవలన్నారు. ఎంపిఒ మద్దిలేటి, ఇసి ఆశోక్,టిఎలు భాస్కర్, వసుంధర,ఎఫ్ఎలు రమేష్ తదితరులు పాల్గొన్నారు.